

వెంకటగిరి పట్టణం రామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కార్తీక శోభ

శైవాలయాలకు పోటెత్తిన భక్తజనం



శ్రీకాళహస్తీశ్వరాలయం ఆవరణలోని శివయ్య గోపురం వద్ద దీపారాధన

తిరుపతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం తొలి సోమవారం జిల్లాలోని శైవాలయాలు కిటకిటలాడాయి. ఆలయాల్లోని కోనేర్లలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయ పరిసరాల్లో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. భక్తులకు తోడు అయ్యప్ప భక్తుల తాకిడితో తిరుపతిలోని కపిలతీర్థం కళకళలాడింది. శ్రీకాళహస్తీశ్వరాలయ ప్రాంగణంలో దీపారాధన చేశారు. అనుబంధ శివాలయాల్లోనూ పూజా కైంకర్యాలు జరిపి దీపాలు వెలిగించారు. సూళ్లూరుపేటలోని నాగేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం చుట్టూ మహిళలు దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. మన్నారు పోలూరు సంతానేశ్వర స్వామి ఆలయం, కల్యాణేశ్వర స్వామి ఆలయాల్లోనూ భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. తిరుచానూరులోని యోగిమల్లేశ్వర స్వామి ఆలయంలోనూ కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.





తిరుపతి నగరం కపిలతీర్థంలో కార్తీక దీపాల సందడి



దీపాలతో వెలుగుతున్న నారదపుష్కరిణి

నేత్రపర్వంగా లక్ష దీపోత్సవం



దీపాలు వెలిగిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న నారద పుష్కరిణిలో కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ప్రదోష వేళ లక్ష దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అధికారులు ముందుగా పుష్కరణి చుట్టూ నేతి దీపాలను సిద్ధం చేశారు. పుష్కరణి ప్రాంగణంలో స్వామిఅమ్మవార్ల చిత్రపటానికి విశేష హారతులు సమర్పించాక లక్షదీపోత్సావాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, రిషితా రెడ్డి దంపతులు దీపాలను ప్రజ్వలన చేశారు. శ్రీకాళహస్తి క్షేత్రంలో మొదటిసారి జరిగిన ఈ విశేష వేడుకను మహిళలు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. దీప కాంతులతో నారదపుష్కరణి దేదీప్యమానంగా ప్రకాశించింది. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, ప్రధాన అర్చకుడు కరుణాకర్ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆకాశ దీపాన్ని ఎగురవేశారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



ఆకాశ దీపం

విమానాశ్రయాలకు దీటుగా

రైల్వే స్టేషన్ల అభివృద్ధి

● స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ తదితరులు

తిరుపతి(సెంట్రల్), నవంబరు4 (ఆంధ్రజ్యోతి): దేశంలో విమానాశ్రయాలకు దీటుగా రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి, ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించనున్నట్లు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ వెల్లడించారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో సోమవారం నూతన భవనాల నమూనాలను, అభివృద్ధి పనులను పరిశీలించారు. నిర్మాణాల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ప్రయాణికులకు మౌలిక వసతులు కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన రైల్వే స్టేషన్లకు నిధులు కేటాయించిందన్నారు. మరో 50 ఏళ్ల వరకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నూతన భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. అంతకుముందు తిరుచానూరు సమీపంలోని ఓ హోటల్‌లో స్టాండింగ్ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. రైల్వే ప్రాజెక్టుల పనితీరుపై చర్చించినట్లు సీఎం రమేష్ తెలిపారు. రైల్వే స్టేషన్లలో రైళ్ల అవసరాలకు అనుగుణంగా మల్టీలెవల్ ప్లాట్‌ఫారాలు, రైలు మార్గాల్లోని అత్యవసర ప్రదేశాల్లో అండర్ బ్రిడ్జిలు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. రాష్ట్రంలోని ప్రధాన రైల్వే స్టేషన్లలో అన్ని హంగులతో ఆధునిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ నాయకులు కె.సదాశివరెడ్డి, బాబు, మునికుమార్, మెండ్రిపాల్ హెచ్ఆర్ఏ పెంచాలని కోరుతూ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యల పరిష్కారానికి రైల్వే కూలీపోర్టర్లు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లక్ష్మణ్, భోలేసింగ్, మహరాజ్‌తో పాటు పలువురు సభ్యులు, దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజరు అరుణ్‌కుమార్ జైన్, సీఈ సూర్యనారాయణ, సీపీవో సత్యప్రకాష్, డీఆర్ఎం విజయకుమార్, స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఎస్ఎంఆర్ చిన్నస్వరెడ్డి, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, గుండాల గోపీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పైసీ ప్యారడైజ్ సీజ్

● లోపలంతా అపరిశుభ్రం.. భారీగా బొద్దింకలు
● అపరిశుభ్ర హోటళ్లపై కఠినంగా వ్యవహరిస్తామన్న హెల్త్ ఆఫీసర్



హోటల్లో తనిఖీ చేస్తున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్

తిరుపతి (ఉపాధ్యాయనగర్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): హోటల్లోని వంటగది అపరిశుభ్రంగా ఉంది. బొద్దింకలు తిరగాడుతున్నాయి. దీంతో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని స్పైసీ ప్యారడైజ్ హోటల్‌ను సోమవారం అధికారులు తనిఖీ చేసి సీజ్ చేశారు. పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్విగ్గీ యాప్ ద్వారా స్పైసీ ప్యారడైజ్ హోటల్లో బకెట్ బిర్యానీకి ఓ వినియోగదారుడు ఆర్డర్ పెట్టారు. రూ.1255 చెల్లించారు. ఆ బిర్యానీలో బొద్దింక ఉండటం.. హోటల్ నిర్వాహకులను అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అతడు ఫొటోలు, వీడియోలతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. ఇది 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమవడంతో సోమవారం ఆహార భద్రతాధికారులు, మున్సిపల్ ఆరోగ్యాధికారులు స్పైసీ ప్యారడైజ్ హోటల్లో తనిఖీలు నిర్వహించారు. వంటగది అత్యంత అపరిశుభ్రంగా ఉండటం, బొద్దింకలను చూసి అధికారులు నివ్వెరపోయారు. పాత్రలకు మూతలు లేవు. కోల్డ్ స్టోరేజీకి సరైన పద్ధతి అమలు చేయకపోవడం తదితరాలను అధికారులు గుర్తించారు. అన్ని ఆహార పదార్థాల నమూనాలు సేకరించారు. హోటల్‌ను తాత్కాలికంగా మూతవేశారు. నిబంధనలన్నీ పాటిస్తూ మార్పులు చేశాకే మళ్లీ తెరిచేందుకు అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. తాము గుర్తించిన లోటుపాట్లను పేర్కొంటూ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. కాగా, ఆహార భద్రతా నిబంధనలు పాటించని హోటళ్లపై కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ అన్వేష్ హెచ్చరించారు. స్పైసీ ప్యారడైజ్‌లో తీసిన ఆహార పదార్థాల నమూనాలకు సంబంధించి ల్యాబ్ రిపోర్టులు వచ్చాక మరిన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తనిఖీల్లో పాల్గొన్నారు.

శిల్పారామంలో గేమ్‌జోన్‌కు తాళం

● విషమంగా గౌతమి ఆరోగ్యం



తిరుచానూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో గేమ్‌జోన్‌కు తాళం పడింది. ఆదివారం సాయంత్రం క్రాస్‌వీల్‌లో సీటు విరిగి 20 అడుగుల కింద పడటంతో లోకేశ్వరి మృతిచెందగా, గౌతమి గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స పొందుతున్న గౌతమి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై శిల్పారామం సంస్థల సీఈవో స్వామినాయుడు ఇక్కడి ఏవో ఖాదరవల్లితో మాట్లాడారు. ఫిట్‌నెస్‌పై నిర్లక్ష్యంగా ఎందుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. శిల్పారామంలోని గేమ్‌జోన్‌లోని ఆటవస్తువుల ఫిట్‌నెస్‌పై దృష్టి సారించాలన్నారు. సక్రమంగా ఉంటేనే తిరిగి గేమ్ జోన్‌ను పునరుద్ధరించాలని సూచించారు. ఘటనపై విచారణ చేయనున్నట్లు తెలిసింది. కాగా, క్రాస్ వీల్ కాంట్రాక్టర్ ప్రభాకర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసునమోదు చేశారు.

రేపే టీటీడీ బోర్డు ప్రమాణ స్వీకారం

● నేడు తిరుమలకు రానున్న చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): కొత్తగా నియమితులైన టీటీడీ ధర్మకర్తల మండలి బుధవారం ఉదయం ఏడు గంటలకు ప్రమాణ స్వీకారం చేయనుంది. చైర్మన్‌గా బీఆర్ నాయుడితో పాటు 17 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలిసింది. దీనికి టీటీడీ ఏర్పాట్లు చేస్తోంది. కాగా, చైర్మన్‌గా నియమితులైన బీఆర్ నాయుడు మంగళవారం ఉదయం చిత్తూరు జిల్లా పెనుమూరు మండలంలోని ఆయన సొంతూరు దిగువపూనేపల్లికి వెళ్లి పూజలు నిర్వహిస్తారు. అనంతరం మధ్యాహ్నం 3గంటలకు తిరుమలలోని గాయత్రి అతిథిగృహానికి చేరుకుంటారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపండి


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మోహిద్దీన్ బాషా

పాకాల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానుగుణంగా అధ్యాపకులతో పాటు తల్లిదండ్రులు తమ పిల్లల చదువులపై శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్ డాక్టర్ మోహిద్దీన్ బాషా సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాలకు క్రమం తప్పకుండా వెళ్తున్నారా.. ఏం చదువుతున్నారు.. పాఠ్యాశాలపై ఇంటికి రాగానే పిల్లలను తల్లిదండ్రులు అడగాలన్నారు. కళాశాలలో బోధన, పరీక్షల గురించి వివరించారు. హాజరు, మార్కులు తదితర అంశాల గురించి అధ్యాపకులు వివరించాలన్నారు. బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బేబీశ్వరరెడ్డి, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్, ఈశ్వరబాబు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు


సురేష్‌రెడ్డి-విక్రాంత్, కృష్ణచైతన్య

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. టీడీపీ నేత బీటెక్ రవి, మాజీ స్పీకర్ సురేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ విక్రాంత్, సినీనటుడు మధు, కృష్ణచైతన్య ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

● ప్రసాదాలు మెరుగుపడ్డాయి

రాష్ట్రం ప్రభుత్వం మారి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శ్రీవారి ప్రసాదాలు మెరుపడ్డాయని బీటెక్ రవి అన్నారు. దర్శనం తర్వాత ఆయన ఆలయం ముందు మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రసాదాలు చాలా రుచిగా ఉన్నాయన్నారు. ఇక, వీఐపీ బ్రేక్ దర్శన సమయాలను కూడా మార్పు చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి కూడా తీసుకెళతామన్నారు.

కాట్పాడి వరకు రైల్వే డబుల్ లైన్ ఏర్పాటు చేయండి


చైర్మన్‌ను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

చంద్రగిరి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి కాట్పాడి వరకు రైల్వే డబుల్ లైన్ ఏర్పాటు చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సుబ్రమణ్యంయాదవ్ ఆధ్వర్యంలో రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్, సభ్యుడు లక్ష్మణ్‌లకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే డబుల్ లైన్ నిర్మాణంలో చాలా ఏళ్ళుగా జాప్యం జరుగుతోందన్నారు. తిరుమల పుణ్యక్షేత్రం దృష్ట్యా భక్తులు అధికంగా వస్తుంటారన్నారు. కాట్పాడి -తిరుపతి మార్గంలో రైళ్ల రాకపోకలు పెరిగాయన్నారు. త్వరగా డబుల్ లైన్ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. బీజేపీ నాయకులు గుండాల గోపినాథ్‌రెడ్డి, తిలక్‌యాదవ్, నరేష్‌కుమార్‌నాయుడు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల నుంచి రూ.1.54లక్షలు స్వాధీనం

తిరుచానూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో ఓ హోటల్‌పై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 13మందిని అరెస్టు చేశారు. సీఐ సునీల్‌కుమార్ తెలిపిన మేరకు తిరుచానూరు బైపాస్‌రోడ్డులోని స్ప్రింగ్ హిల్స్ హోటల్‌లో కొందరు పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సోమవారం పోలీసులు హోటల్‌లో సోదాలు నిర్వహించగా 13మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1.54లక్షలు నగదుసీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. గతంలో కూడా ఇదే హోటల్‌లో పేకాట ఆడుతూ పలువురు చిక్కారు. పోలీసు అదుపులోకి తీసుకున్న వారిలో అధికారప్రతిపక్షాలకు చెందిన నేతలు, వ్యాపారస్థులు ఉన్నట్లు తెలిసింది. చెంచులక్ష్మియానాదికాలనీలో నలుగురిని అదుపులోకి రూ. 5,300 సీజ్ చేశారు.

ఘాట్‌రోడ్డు లోయలోకి దూకిన మధ్యప్రదేశ్‌వాసి

● కాపాడిన ట్యాక్సీ డ్రైవర్,ప్రయాణికులు


చోటు

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతి-తిరుమల రెండవ ఘాట్‌రోడ్డులో మంగళవారం ఓ యువకుడు లోయలోకి దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. మధ్యప్రదేశ్‌కు చెందిన చోటు తిరుమలలోని ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం తిరుపతి నుంచి తిరుమల వెళ్లడానికి కమాండర్ జీపు ఎక్కాడు. మార్గంలోని మూడవ కిలోమీటరు వద్ద జీపులో చిన్నపాటి సమస్య రావడంతో రోడ్డు పక్కగా ఆపారు. అదే సమయంలో కిందకు దిగిన చోటు పిట్టగోడ ఎక్కి లోయలోకి హఠాత్తుగా దూకేశాడు. వెంటనే గుర్తించిన డ్రైవర్, తోటి ప్రయాణికులు అరుస్తూ దగ్గరకు వెళ్లే ప్రయత్నం చేశారు. జీపు డ్రైవర్‌తో పాటు మరికొంతమంది డ్రైవర్లు కిందకు దిగి అతన్ని పైకి తీసుకువచ్చారు. తక్కువ ఎత్తు ఉండటంతో చిన్నపాటి గాయాలతో బయటపడ్డాడు. విజిలెన్స్ అధికారులు చేరుకుని అతడిని అదుపులోకి తీసుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. మతిస్థిమితం లేక లోయలోకి దూకి ఉండవచ్చని అభిప్రాయపడుతున్నారు.

పోలీసు శాఖకు 60 ఫిర్యాదులు


పజల సమస్యలను ఆలకిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 60 ఫిర్యాదులు వచ్చాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను ఎస్పీ సుబ్బరాయుడు విని, వారి నుంచి వినతులు స్వీకరించారు. తక్షణం పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవి మనోహరాచారి, వెంకట్రావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని బాగుచేసే శక్తినివ్వాలని ప్రార్థించా: సీఎం రమేష్


ఆలయం ముందు లక్ష్మణ్, సీఎం రమేష్

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో చెడిపోయిన ఈ రాష్ట్రాన్ని బాగుచేసే శక్తిని ప్రధాని మోదీకి, సీఎం చంద్రబాబుకు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్‌కు ఇవ్వాలని శ్రీవారిని ప్రార్థించినట్లు ఎంపీ సీఎం రమేష్ తెలిపారు. సెంట్రల్ రైల్వే స్టాండింగ్ కమిటీ అధ్యక్షుడి హోదాలో సభ్యుడు లక్ష్మణ్‌తో కలిసి సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీ, తెలంగాణల్లో రైల్వే ప్రాజెక్టులను ఎలా అభివృద్ధి చేయాలి, మిస్సింగ్ లింకులు ఎక్కడున్నాయి, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై సెంట్రల్ రైల్వే స్టాండింగ్ కమిటీ తనిఖీలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగా తిరుపతిలో రైల్వే స్టేషన్‌ను పరిశీలించడంతో పాటు అధికారులతో సమీక్షిస్తామన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో జరిగిన తప్పిదాలపై పూర్తిస్థాయి దర్యాప్తు చేయాలని తెలంగాణ ఎంపీ కె.లక్ష్మణ్ డిమాండ్ చేశారు. తిరుమల పవిత్రతను కాపాడాలని ఇప్పటికే సీఎం చంద్రబాబుకు లేఖ రాసినట్లు తెలిపారు.

పీజీ, పీహెచ్‌డీ అడ్మిషన్లు యూనివర్సిటీ చేపట్టే అవకాశం


రామ్మోహనరావును సన్మానిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

● ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు ఎస్వీయూ అధికారుల విన్నపం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పీజీ, పీహెచ్‌డీ అడ్మిషన్లు యూనివర్సిటీనే నిర్వహించుకునేలా అనుమతించాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ రామ్మోహనరావును ఎస్వీయూ అధికారులు కోరారు. యూనివర్సిటీలో నిర్వహించిన ఓ అధికారిక కార్యక్రమానికి హాజరైన రామ్మోహనావుతో వారు పలు విషయాలపై చర్చించారు. పీజీ, పీహెచ్‌డీ అడ్మిషన్లు యూనివర్సిటీ స్థాయిలోనే నిర్వహించేలా అనుమతించాలన్నారు. ఇందుకు రామ్మోహనరావు సానుకూలంగా స్పందించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో గుర్తింపు, ర్యాంకులు యూనివర్సిటీకి దక్కేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పేటెంట్లు, జర్నల్స్‌లో ఆర్టికల్స్ వంటి విషయాలపై దృష్టి సారించాలన్నారు. విదేశీ విద్యార్థులు, స్కాలర్స్‌ను చేర్చుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, డీన్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ముక్కోటిలో రుద్రాభిషేక అలంకరణలో స్వామివారు.

శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు



యోగిమల్లవరంలోని కామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో భక్తుల పూజలు

● కార్తీక తొలిసోమవారం అభిషేకాలు

ఎర్రావారిపాలెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి); శైవక్షేత్రం తలకోనలో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా భక్తులు తరలివచ్చారు. దీపోత్సవం వేళ సిద్దేశ్వర స్వామి ఆలయం శివనామ స్మరణతో మారుమోగింది. మహిళలు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ పాలక మండలి చైర్మన్ సోమరెడ్డి,పాలనాధికారి మమతలు భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక అభిషకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు ప్రసన్న కుమార్ స్వామి, సత్యప్రసాద్‌లు తీర్థ ప్రసాదాలు అందించారు. ●తిరుచానూరు: యోగిమల్లవరంలోని కామాక్షాంబ సమేత పరాశరేశ్వరస్వామి ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు. అభిషేకం నిర్వహించారు. కార్తీక మాసం ముగిసేవరకు ఉదయం అభిషేకం ఉంటుందని అర్చకులు తెలిపారు. మహిళలు కార్తీక దీపాలు పెట్టి స్వామి అమ్మవార్లను దర్శించుకునిమొక్కులు చెల్లించుకున్నారు. ●చంద్రగిరి: తొండవాడ వద్ద అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం, అనందవల్లిదేవికి అభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో (పుట్టాలమ్మ) రుద్రాభిషేకం నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ముక్కోటి ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి, పుట్టాలమ్మ ఆలయ శైవాగ పండితులు శివకుమార్ శర్మ, కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



తలకోన సిద్దేశ్వర స్వామి ఆలయంలో భక్తులు

●రామచంద్రాపురం: రాయలచెరువు కట్ట భవానీ జలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీకశోభ సంతరించుకుంది. వేకువజామున స్వామివారిని సుప్రభాతంతో మేలుక్కొల్పి సహస్ర నామార్చన అనంతరం తిరుమంజనం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం పుష్కరణిలో కార్తీక దీపాలువెలిగించారు.

మాతృ సంస్థలకు టీటీడీ ఏవీఎస్వోలు

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): టీటీడీ విజిలెన్స్‌లో పలువురు ఏవీఎస్వోలను మాతృ సంస్థలకు పంపుతూ సీవీఎస్వో శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీవారి ఆలయ ఏవీఎస్వో మనోహర్, పరకామణి ఏవీఎస్వో శివయ్య, సెక్టార్4 ఏవీఎస్వో సాయి గిరిధర్, వింగ్ ఏవీఎస్వో పద్మనాభన్‌లను టీటీడీ నుంచి మాతృ సంస్థకు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. ఈ విభాగాలను ఇతర ఏవీఎస్వోలు, వీజీవోలకు అదనపు బాధ్యత అప్పగించారు. త్వరలో పూర్తి స్థాయి ఏవీఎస్వోలను నియమించనున్నారు.

పొలం తగాదా 8మందికి గాయాలు

పాకాల, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పొలం సర్వే చేస్తున్న సమయంలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. పరస్పరం దాడి చేసుకోవడంతో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మద్దయ్య ఆచారి కథనం మేరకు మండలంలోని ఉప్పరపల్లె పంచాయతీ అబ్బానాయుడు ఇండ్లు గ్రామానికి చెందిన ఎస్.వెంకట్రావనాయుడు,వి.బాబునాయుడులు సోమవారం పొలంలో సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. కర్రలతో ఇరువర్గాలు దాడి చేసుకోవడంతో గాయాలపాలయ్యారు. చికిత్స నిమిత్తం పికొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.76 కోట్లు

తిరుమల, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.76 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 84,489 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అ 28,871 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు.

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అపరిశుభ్రతకు కేరాఫ్ భాకరాపేట బస్టాండ్

● వాహనాల పార్కింగ్ కేంద్రంగా మారిన వైనం

● ఆవరణలోకి రాని ఆర్టీసీ బస్సులు


బస్టాండు ప్రాంగణంలో పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు

భాకరాపేట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): భాకరాపేట నుంచి నిత్యం వందలాది మంది ప్రయాణం సాగిస్తుంటారు. ఆర్టీసీ బస్టాండు ఉన్నప్పటికీ ఎండైనా, వర్షం వచ్చినా బస్సుల కోసం రోడ్డుపైనే నిలబడి ఉంటారే తప్ప బస్టాండులోకి వెళ్లరు. దీనికి ప్రధాన కారణం ఆ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటమే. దుర్గంధం వెదజల్లుతూ ఉంటుంది. ద్విచక్ర వాహనాలు, ఇతర ప్రైవేటు వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల బస్టాండులోకి బస్సులు వెళ్లవు. చిన్నగొట్టిగల్లు మండలం భాకరాపేట బస్టాండు జంక్షన్ లాంటిది. నిత్యం ఎర్రావారిపాళెం, తలకోనవైపు, పీలేరు వైపు, తిరుపతి వైపు, పులిచెర్ల మండలం మంగళంపేటవైపు వందలాది వాహనాలు వెళుతుంటాయి. ఈ బస్టాండు ప్రాంగణం రద్దీగానే ఉంటుంది.దీని ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు, వాటర్ ప్యాకెట్లు, ఖాళీ గ్లాసులు, దర్శనమిస్తుంటాయి. దుర్గంధం వస్తుంటుంది. దీంతో ప్రయాణికులక బస్టాండులోకి వెళ్లడానికి ఇష్టపడటంలేదు. మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. వాహనాల పార్కింగ్ చేయకుండా బస్టాండు ఆవరణను పరిశుభ్రంగా మార్చాలని,బస్సులు ప్రాంగణంలోకి వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.


బస్టాండు ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు, చెత్తాచెదారం

గుండోడు కనుమ రహదారి ఏర్పాటుకు ప్రయత్నాలు


గుండోడు కనుమను పరిశీలిస్తున్న అధికారులు

రామచంద్రాపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గుండోడు కనుమదారి అందుబాటులోని తెచ్చేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. రాయలచెరువుకట్ట పైభాగంలో బాదూరు నుంచి 50కుపైగా గ్రామాలున్నాయి. రాయలచెరువుకట్ట కింద నెన్నూరు. నడవలూరు, కొత్తకండ్రిగ గ్రామ ప్రజలు ఆర్‌సీపురం మీదుగా తాటిమాకులకండ్రిగ, పరమాల,మిట్టకండ్రిగ, కొత్తకండ్రిగ వెళ్లాల్సి వస్తోంది. రాయలచెరువు నిండితే కట్టపై గ్రామాలకు సంబంధాలు తెగిపోతాయి. కొత్త నెన్నూరు నుంచి గుండోడు కనుమ నడకదారిలో మూడు కిలోమీటర్లు వెళితే చేరుకోవచ్చు. ఈ కనుమదారిని బాగుచేయాలని చాలాకాలంగా ప్రజలు కోరుతున్నారు. 2022లో భారీ వర్షాలకు రాయలచెరువుకట్ట ప్రాంత ప్రజలు పుత్తూరు మీదుగా 40 కిలోమీటర్లు ప్రయాణించి తిరుపతి చేరుకునేవారు. ఆ సమయంలో నాని పర్యటించి టీడీపీ అధికారంలోకి వస్తే కనుమదారిని అందుబాటులోకి తెస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల మాజీ ఎంపీపీ కేశవులునాయుడు, జిల్లా కార్యదర్శి కోరా హరిప్రసాద్ గుండోడు కనుమదారి విషయాన్ని నాని దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పంచాయతీ రాజ్ డీఈ ప్రభాకర్‌రెడ్డి, ఏఈ చిన్నయ్యను గుండోడు కనుమదారిని పరిశీలించి రోడ్డు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. వారు టీడీపీ నాయకులతో కలిసి సోమవారం కొత్త నెన్నూరు నుంచి గుండోడుకనుమ దారిని పరిశీలించారు.

గత ఐదేళ్లలో వైసీపీ చేసిన అభివృద్ధి చెప్పాలి


మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్ తదితరులు

తిరుపతి (జీవకోన), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో, జిల్లాలో జరిగిన అభివృద్ధి ఏమిటో ఆ పార్టీ నేతలు ప్రజలకు చెప్పాలని టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ కోరారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ వైసీపీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణస్వీకార కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు అభివృద్ధిపై మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారు ఏమీ చేయలేదు కాబట్టే ప్రజలు టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించారని, వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. వైఫల్యాలపై చర్చించుకోకుండా పనిగట్టుకుని చంద్రబాబుపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎన్నికలు వచ్చేస్తున్నట్లు, రేపే జగన్ సీఎం అవుతున్నట్లు మాట్లాడడం ఆశ్చర్యం కలిగించిందన్నారు. వడమాలపేట వద్ద చిన్నారిపై హత్యాచారం జరిగితే జిల్లా పరువును దిగజార్చే విధంగా మాజీ మంత్రి రోజా మాట్లాడటం దారుణమన్నారు. వైసీపీ పాలనలో జరిగిన హత్యల గురించి ప్రజలకు తెలుసునన్నారు. రైల్వే అభివృద్ధి పనుల్లో భాగంగా తిరుపతిలో బాలాజీ డివిజన్ ఏర్పాటు చేయాలని పార్లమెంటరీ కమిటీని కోరుతున్నట్లు తెలిపారు. టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ పులుగోరు మురళీకృష్ణారెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ మాట్లాడుతూ 25మంది నాయకులు కలిసి తన బిడ్డను ఓడించారంటూ చెవిరెడ్డి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ దోపిడీ వల్ల రాష్ట్రంలో అభివృద్ధి 25ఏళ్లు వెనక్కు వెళ్లిందన్నారు. 60వేల పైచిలుకు ఓట్లతో ఓడిపోయిన భూమనకు చంద్రబాబును విమర్శించే అర్హత లేదన్నారు. టీడీపీ నాయకులు సుబ్బుయాదవ్, కాయం వెంకటరత్నం, గంజి సుధాకర్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, రాజయ్య, శీనయ్యయాదవ్, గంధం బాబు పాల్గొన్నారు.

ఏపీని అభివృద్ధిపథంలో నడిపించాలని ప్రార్థించా: అనిత



తిరుమల, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని శ్రీవారిని ప్రార్థించినట్లు రాష్ట్ర హోంమంత్రి అనిత తెలిపారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం ఆమె దర్శించుకున్నారు. ఈమేరకు మంత్రికి రంగనాయకమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. దర్శనం అనంతరం మంత్రి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. గత ఐదేళ్లలో అట్టుడికిపోయిన ఏపీని బయటకు తీసుకురావడంతో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ చేస్తున్న కృషికి మంచి ఫలితాలను ఇవ్వాలని ప్రార్థించినట్లు చెప్పారు. కాగా ఉపమాకలోని వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని హోంమంత్రి అనిత టీటీడీ ఈవో శ్యామలరావును కోరారు. శ్రీవారిని సోమవారం దర్శించుకున్న ఆమె దర్శనం అనంతరం ఈవోను కలిసి ఆలయ అభివృద్ధిపై చర్చించారు.

స్కూటరిస్టు మృతి

ఏర్పేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో స్కూటరిస్టు దుర్మరణం చెందాడు. సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు... వెంకటగిరి నియోజకవర్గంలో దగ్గువోలుకు చెందిన రమణయ్య(79) గొర్రెల వ్యాపారి. ఈ క్రమంలో గొర్రెలను కొనడానికి దగ్గువోలు నుంచి సోమవారం ఉదయం ఏర్పేడు మండలం చింతలపాళెంకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తిరిగి వెళ్తుండగా వెంకటగిరి నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. డ్రైవర్ పరారయ్యాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

● మృతదేహంతో బయలుదేరిన బంధువులు

● పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం

● 'క్రాస్‌వీల్' ఘటనలో మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్

● చివరకు నచ్చజెప్పి పంపిన మధ్యవర్తులు

కలెక్టర్ వద్దకే వెళతాం


అంబులెన్సును అడ్డుకున్న పోలీసులతో బాధితుల వాగ్వాదం

తిరుపతి(వైద్యం), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'తిరుచానూరు శిల్పారామంలోని 'క్రాస్‌వీల్' నిర్వాహకుల నిర్లక్ష్యంతో మృతిచెందిన లోకేశ్వరి కుటుంబానికి ప్రభుత్వం, ప్రమాద కారకుల నుంచి సాయం అందకపోవడం దారుణం. ఈ విషయాన్ని కలెక్టరు దృష్టికి తీసుకెళ్లి, అక్కడే న్యాయపోరాటం చేస్తాం' అంటూ మృతదేహంతో బయలుదేరిన బంధువులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గంటకుపైగా వాగ్వాదం జరిగింది. ఆదివారం సాయంత్రం క్రాస్‌వీల్ నుంచి బాక్సు విడిపోయి పడటంతో లోకేశ్వరి మృతిచెందిన విషయం తెలిసిందే. ఆమె మృతదేహానికి రుయాస్పత్రిలో సోమవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతురాలి కుటుంబానికి ఎలాంటి సాయం ప్రకటించకపోవడంతో మృతదేహంతో కలెక్టరేట్‌కు వెళ్లి కలెక్టరును కలిసి.. ఆ తర్వాత మృతురాలి స్వగ్రామమైన అరగొండ సమీపంలోని బోయపల్లికి తీసుకెళ్లాలని రుయాస్పత్రి నుంచి అంబులెన్సులో బయలుదేరారు. అయితే, బాధితులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేసేందుకు మృతదేహంతో బయలుదేరారన్న సమాచారంతో తిరుచానూరు ఎస్‌ఐ అరుణ, సిబ్బందితో రుయాస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రి బయట అంబులెన్సును అడ్డుకున్నారు. మృతదేహంతో కలెక్టరేట్‌కు వెళ్లకూడదని చెప్పారు. తాము ధర్నా చేసేందుకు వెళ్లడం లేదని, న్యాయం చేయాలని అడిగేందుకే వెళుతున్నట్లు బాధితులు చెప్పినా పోలీసులు ఒప్పుకోలేదు. అంబులెన్సుకు అడ్డుగా జీపును పెట్టి పోలీసులు అడ్డుకోవడంతో బాధితులు రోడ్డుపైనే ఆందోళనకు దిగారు. మృతురాలి ఐదేళ్ల కుమార్తె పరిస్థితి ఏంటని వారు పోలీసులతో వాదనకు దిగారు. గంటకు పైగా రోడ్డుపై ఈ చర్చ సాగింది. ఒకానొక దశలో బాధితులు మృతదేహాన్ని అక్కడే అంబులెన్సులో విడిచి వెళ్లే ప్రయత్నం చేశారు. అదే సమయంలో అక్కడకు చేరుకున్న కొర్లగుంటకు చెందిన కొందరు మధ్యవర్తులు క్రాస్‌వీల్ నిర్వాహకులతో మాట్లాడి నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామని బాధితులకు సర్దిచెప్పారు. తమకు ఎవరిపైనా నమ్మకం లేదని కలెక్టరు దృష్టికి తీసుకువెళ్లి అనంతరం జరగాల్సిన కార్యక్రమాలను చూస్తామని బాధితులు స్పష్టంచేశారు. ఇది ఇంతటితో అయిపోదని, కేసుకు సంబంధించి మీరు పోలీసు స్టేషను చుట్టూ ఇంకా కొన్ని రోజులు తిరగాల్సి ఉంటుందనే విషయాన్ని దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు తాము ఇచ్చింది తీసుకొని వెళ్లాలని, లేకుంటే నష్టపోయేది మీరేనంటూ మధ్యవర్తులు సున్నితంగా బెదిరింపులకు పాల్పడ్డారు. అయినా బాధితులు ఆందోళన కొనసాగించారు. ఒకవైపు చీకటి పడటం, న్యాయం చేస్తామంటూ మధ్యవర్తుల ఒత్తిడితో వారు స్వగ్రామానికి మృతదేహాన్ని తీసుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.


తల్లిని కోల్పోయిన కుమార్తె

వ్యవస్థలను భ్రష్టు పట్టించిన వైసీపీ: హోం మంత్రి


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అనిత

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. రుషికొండ ప్యాలెస్ ఎవరి కోసం నిర్మించారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి కపిలతీర్థంలోని శివాలయాన్ని ఆమె దర్శించుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో బాబు, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శన భాగ్యం కల్పించి, వేద పండితులతో వేద ఆశీర్వచనాలు అందించారు. తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ నివారణకు గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి వెంట అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, అధికారులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 38 వినతులు

తిరుపతి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 38 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో అక్రమాలు జరిగాయని, నగరంలోని సీసీ రోడ్లలో ఉన్న గుంతలు పూడ్చాలని, లక్ష్మీపురం కూడలి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు వేర్వేరుగా నిర్మించాలని డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, తమ వార్డుల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ అనిల్‌కుమార్ కమిషనర్‌ను కోరారు. తమ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డుకు తీసుకున్న స్థలానికి టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, శెట్టిపల్లి ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని, మల్టీలెవల్ కార్ పార్కింగ్ పనులు జరుగుతూనే ఉన్నాయని దీంతో తమ వ్యాపారాలు పూర్తిగా తగ్గాయని, మాకు ప్రత్యామ్నాయం చూపాలని వ్యాపారస్తులు కోరారు. అన్నింటిని పరిశీలించిన కమిషనర్ ఆయా విభాగాల అధికారులకు అర్జీలను కేటాయించారు. ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్ఈ శ్యాంసుందర్,ఎంఈలు తులసికుమార్, గోమతి, ఎంహెచ్‌వో యువ అన్వేష్, ఆర్వో రవి పాల్గొన్నారు.

ఇండియన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీ కరప్షన్ సెల్ నూతన కార్యవర్గం ఎంపిక



తిరుపతి అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇండియన్ హ్యూమన్ రైట్స్ అండ్ యాంటీకరప్షన్ సెల్ నూతన కమిటీ ఎన్నికైంది. సోమవారం ఎల్ఐసీ రోడ్డులోని కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కాణిపాకం మురళి ఆధ్వర్యంలో నగర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.కుమార్, కార్యదర్శిగా ఇనుగుర్తి హరి నాయుడు, సంయుక్త కార్యదర్శిగా మధుసూదన్, ఉపాధ్యక్షులుగా ఎ.మొగిలీశ్వరుడు, బి.సిద్ధేశ్వర్ ఎన్నికయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

చెవిరెడ్డి హుందాగా వ్యవహరించాలి: టీడీపీ


మీడియాతో మాట్లాడుతున్న ఈశ్వర్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): 'వైసీపీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణస్వీకార కార్యక్రమంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి మాట్లాడుతూ తన బిడ్డను 25మంది కలిసి ఓడించారని చెప్పారని, వారంతా టీడీపీ నాయకులేనని, వారు వ్యతిరేకంగా కాకపోతే అనుకూలంగా పనిచేస్తారా' అంటూ టీడీపీ తిరుపతి రూరల్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి ఎద్దేవా చేశారు. హుందా రాజకీయాలు చేయాలని హితవుపలికారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గురువుకే పంగనామాలు పెట్టాలని చూసిన చెవిరెడ్డి శుద్ధులు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కరుణాకరరెడ్డికి, అభినయ్‌కు టికెట్ రాకుండా జగన్ దగ్గర చేసిన ప్రయత్నాలు అందరికీ తెలుసునన్నారు. ఓడిపోతానన్న భయంతోనే చెవిరెడ్డి ఒంగోలు పారిపోయారని విమర్శించారు. టీడీపీ అధికారం చేపట్టిన ఈ ఐదు నెలలు కాలంలో చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు కన్నయ్యనాయుడు, అలిమినేని మధు, రమేష్‌రెడ్డి, కత్తి సుధాకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కిషోర్‌కుమార్‌కు ఆర్సీ మునికృష్ణ అభినందన


ప్రెసిడెంట్ కిషోర్‌కుమార్‌ను అభినందిస్తున్న ఆర్సీ మునికృష్ణ

తిరుపతి అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): టీటీడీ ఎంప్లాయిస్ కోఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఆర్.కిషోర్‌కుమార్‌కు 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ అభినందించారు. సోమవారం టీటీడీ పరిపాలన భవన ఆవరణలో కిషోర్‌కుమార్ ప్రమాణస్వీకారం చేశారు. ఆర్సీ మునికృష్ణ ఆయనకు శాలువకప్పి గజమాలతో సత్కరించారు. మరిన్ని పదవులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు వైస్ ప్రెసిడెంట్ టి.జి.వెంకటకృష్ణ, 35వ డివిజన్ వార్డు అధ్యక్షుడు ఎస్.వి.ఎం.శ్రీధర్, కరాటే చంద్ర, సుబ్బుయాదవ్, జగ్గా, మణినాయుడు, రవితేజనాయుడు, రవీంద్రారెడ్డి, నాగప్రతాప్, ముని పాల్గొన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవడం దుర్మార్గం


కార్పొరేటర్లను ఉద్దేశించి మాట్లాడుతున్న కరుణాకరరెడ్డి

తిరుపతి (జీవకోన), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మున్సిపల్ కార్పొరేషన్‌లో టెండర్లు నిర్వహించి, ఇచ్చిన పనులను రద్దు చేయడం దుర్మార్గమైన విషయమని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన తన నివాసంలో పార్టీ కార్పొరేటర్లతో సమావేశమయారు. ఈనెల 7న కౌన్సిల్ సమావేశం ఉండడంతో పలు విషయాలపై చర్చించారు. కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ ఎన్నికలు వెంటనే జరిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో మేయర్ డాక్టర్ శిరీష, అభినయరెడ్డి, పార్టీ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగులకు గొడుగుల వితరణ



తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం సభ్యులకు సోమవారం గొడుగులు వితరణ చేశారు. సంఘం సభ్యులకు అసోసియేషన్ తరఫున ఏటా బహుమతి ప్రదానం చేయడం ఆనవాయితీ. 2024 సంవత్సరానికి గాను ప్రజారవాణాధికారి కార్యాలయంలోని అసోసియేషన్ ఆఫీసులో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, బస్టాండు ఏటీఎం రామచంద్రనాయుడు చేతులమీదుగా 400మందికి గొడుగులు అందజేశారు.

క్రీడా సముదాయంలో మరమ్మతులు


బాత్‌రూమ్‌లో కొత్తపైపుల ఏర్పాటు, మరకలు తొలగిస్తున్న కార్మికుడు

తిరుపతి(క్రీడలు), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాస క్రీడా సముదాయంలో మరమ్మతులు జోరుగా సాగుతున్నాయి. నాలుగు రోజుల క్రితం శాప్ ఛైర్మన్ రవినాయుడు కాంప్లెక్స్‌ను సందర్శించి, నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన ఆదేశాల మేరకు డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఇప్పటికే బేబీ స్విమ్మింగ్‌పూల్‌ను శుభ్రం చేయించారు. ఈతకొలనుకు అనుసంధానంగా ఉన్న టాయిలెట్స్, బాత్‌రూమ్‌లలో మరకలను తొలగించారు. కొత్త పైపులు, షవర్స్ నీటి కొళాయిలు, బల్బులు అమర్చారు. ఆవరణలో చెత్త తొలగించారు.

తుడా చైర్మన్‌గా శ్రీధర్‌వర్మను నియమించాలి

తిరుపతి అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్షత్రియ కులానికి చెందిన టీడీపీ సీనియర్ నేత శ్రీధర్‌వర్మకు తుడా చైర్మన్ పదవి ఇవ్వాలని రాష్ట్రీయ క్షత్రియ సేవా సంఘం రాయలసీమ అధ్యక్షుడు ఎస్.బలరామరాజు కోరారు. ఎన్టీఆర్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన శ్రీధర్‌వర్మకు టీటీడీ బోర్డులో అవకాశం లభిస్తుందని క్షత్రియులు భావించారని, అయితే ప్రభుత్వ నిర్ణయం నిరాశపరిచిందని తెలిపారు. తుడా చైర్మన్‌గా అయినా అవకాశం కల్పించేలా సీఎం చంద్రబాబు చర్యలు తీసుకోవాలని కోరారు.

భస్మాలంకరణలో భ్రమరాంబికా మల్లికార్జునస్వామి



తిరుపతిరూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం ఎల్ఎస్‌నగర్‌లోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీకమాస మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని స్వామివారు భస్మాలంకరణ(విభూది)లో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు చెంగారెడ్డి, ఉమాపతిరెడ్డి, అర్చకులు దివాకర్, లీలా, వంశీ తదితరులు పాల్గొన్నారు.


ధ్వంసమైన రోడ్లు

రోడ్ల సొగసు చూడతరమా..!

తిరుపతి రూరల్ మండలం మంగళం పరిధిలోని మిట్టగాంధీపురంలో రోడ్లు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. కరకంబాడీ రోడ్డు, శెట్టిపల్లెరోడ్డు నుంచి మిట్టగాంధీపురానికి రెండు మార్గాలు ఉన్నాయి. రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వంలో రూ.78లక్షల తుడా నిధులతో తారు రోడ్లు వేశారు. నాణ్యత లోపం కారణంగా వేసిన కొన్ని రోజులకే వర్షాలకు తారు పూర్తిగా లేచిపోయి రోడ్డు పొడవునా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం నెలకొంది. పైగా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరిగి అడ్డంకిగా మారాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు.

- తిరుపతి అర్బన్ (ఆంధ్రజ్యోతి)

తిరుపతిని రైల్వే జోన్‌గా మార్చండి

- నగరంలో మరిన్ని అండర్ బ్రిడ్జిలు అవసరం
- సీఎం రమేష్‌కు టీడీపీ నేతల వినతి



తిరుపతి, నవంబరు4(ఆంధ్రజ్యోతి): తిరుపతిని రైల్వే బాలాజీ డివిజన్‌గా ప్రకటిస్తే యాత్రికులకు, ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహ యాదవ్ పేర్కొన్నారు. తిరుపతికి వచ్చిన సెంట్రల్ రైల్వే స్టాండింగ్ కమిటీ మెంబర్ సీఎం రమేష్‌ను సోమవారం టీడీపీ నేతలు కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. తిరుపతి బస్టాండ్ వద్ద అంబేడ్కర్ సర్కిల్ దక్షిణం వైపు నుంచి వెంకటేశ్వర థియేటర్ వైపు రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరు చేయాలన్నారు. రైల్వే స్టేషన్‌కు అదనంగా రెండు ప్లాట్‌ఫారమ్‌లను జోడించి, వాటిపై కొత్త రైళ్లను నడిపేందుకు కృషి చేయాలన్నారు. తిరుపతి నుంచి కాట్పాడి జంక్షన్ వరకు డబుల్ లైన్‌గా మార్చాలని, తిరుపతి నుంచి వారణాసికి వారానికి మూడు రోజులు నడిచే రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. హోండా షోరూమ్ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి ఇప్పటికే మంజూరు చేశారని, పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. పద్మావతి ఫ్లోర్‌మిల్లు, శెట్టిపలి రైల్వే గేట్ సమీపాన రైల్వే అండర్ బ్రిడ్జి వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు.యశ్వంత్ రెడ్డి, రాజయ్య, చెంగయ్య, చిత్తూరు రవిశంకర్ యాదవ్, గంధం బాబు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత వర్సిటీలో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు


ప్రొఫెసర్ సింగరాజు దక్షిణామూర్తిశర్మ, చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ పి.వెంకట్రావ్, కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, అడిషనల్ కోఆర్డినేటర్ డాక్టర్ సీతారాంశర్మ పాల్గొన్నారు.

తిరుపతిరూరల్, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్కృత వర్సిటీలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. సంస్కృత భాషలోని మహోన్నత విషయాలను దైనందిన జీవితంలో అన్వయించడం ద్వారా అవినీతి రహిత దేశాన్ని నిర్మించుకోవచ్చని చెప్పారు. ఇందులో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో తొలిమూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అకడమిక్ డీన్ ప్రొఫెసర్ రజనీకాంత్‌శుక్లా, స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్

కపిలతీర్థంలో ముగిసిన గణపతి హోమం



తిరుపతి(కల్చరల్), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కపిలేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న గణపతి హోమం సోమవారం ముగిసింది. యాగశాలలో ఏర్పాటు చేసిన వినాయకస్వామికి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. శనివారం నుంచి జరుగుతున్న హోమం సోమవారం పూర్ణాహుతితో ముగిసింది. గణపతి హోమం నిర్వహించడం వలన జీవితంలో ఎదురయ్యే విఘ్నాలు తొలగిపోతాయని అర్చకులు తెలిపారు. ఆలయ డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, అర్చకస్వాములు పాల్గొన్నారు. అదేవిధంగా ఆలయంలో మంగళవారం నుంచి గురువారం వరకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి హోమం నిర్వహించనున్నారు. 7వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం జరుగుతుంది.

ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతిగా దేవప్రసాదరాజు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ భౌతికశాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ బి.దేవప్రసాదరాజు నియమితులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ఉత్తర్వులు వెలువరించారు. 2007లో వర్సిటీలో అధ్యాపకులుగా చేరిన దేవప్రసాదరాజు డీఓఏ డిప్యూటీ డైరెక్టర్‌గా, శాస్త్ర ఉపకరణ కేంద్రం డైరెక్టర్‌గా, హాస్టల్ వార్డెన్‌గా, ఏపీఆర్‌సెట్-2024 కన్వీనర్‌గా పనిచేశారు. మూడు రీసెర్చ్ ప్రాజెక్టులు పూర్తి చేశారు. బాధ్యతలు స్వీకరించిన దేవప్రసాదరాజును పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సత్కరించారు.

గౌరవ వేతనాలిప్పించండి

తిరుపతి, నవంబరు4(ఆంధ్రజ్యోతి) : తిరుపతి రూరల్ మండలంలో పనిచేస్తున్న తమకు మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం ఇప్పించాలని బీఎల్వోలు కోరారు. గ్రీవెన్స్‌లో ఆర్డీవోకు బీఎల్వోలు వినతిపత్రం అందజేశారు. 2024 ఎన్నికలకు సంబంధించి ఈవీఎం కమీషన్, ఎన్నికల లెక్కింపునకు సంబంధించిన వేతనాలు కూడా ఇంతవరకు అందలేదన్నారు. ఒక్కొక్కరికి రూ.30వేల వరకు బకాయిలు ఉన్నాయని తెలిపారు. పరిశీలిస్తామని ఆర్డీవో హామీ ఇచ్చారు. అదేవిధంగా పలు భూ వివాదాలకు సంబంధించి ఆర్డీవోకు ఫిర్యాదులు అందాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తిరుపతి(ఆటోనగర్) నవంబరు4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ తిరుచానూరు సెక్షన్ పరిధిలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ వి.చంద్రశేఖరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతులు చేపడుతున్న కారణంగా బ్రాహ్మణపట్టు, పాతూరు, వినాయక నగర్, కొత్తూరు, రేణిగుంట మండలంలోని సూరప్పకశం, విప్పమానుపట్టెడ గ్రామాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

వేదాంతపురంలో ఆక్రమణలపై విచారించండి


తహసీల్దార్‌కు విన్నవిస్తున్న నరసింహమూర్తి

తిరుపతి రూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం పంచాయతీలో గతంలో జరిగిన ప్రభుత్వ భూమి ఆక్రమణలపై విచారణ జరపాలని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీదారు జేవీ నరసింహమూర్తి కోరారు. సర్వే నంబరు 250లో బండపోరంబోకు భూమి ఉందని, దీనిలో కేటాయించిన పట్టాలలో లబ్ధిదారులు కాకుండా ఇతరులు నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. పంచాయతీకి చెందిన వైసీపీ నేతలతో స్థానిక రెవెన్యూ అధికారులు కలసి ఈ అవకతవకలకు పాల్పడారని ఆరోపించారు. అలాగే స్వర్ణముఖి నది తీరంలోని భూమి ఆక్రమణకు గురైందని తెలిపారు. విచారణ చేపట్టాలని కోరారు. మరికొందరు భూముల విషయమై అర్జీలు సమర్పించారు. ఫిర్యాదులపై స్పందించిన తహసీల్దార్ రామాంజులునాయక్ విచారణ చేపట్టాలని ఆదేశించారు.

పాఠశాలలకు నిబంధనలు సడలించండి


ఫైర్ డీజీ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న అప్సా నాయకులు

తిరుపతి విద్య, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు ఇబ్బందిగా ఉన్న కొన్ని అగ్నిమాపక శాఖ నిబంధనలను సరళీకరించాలని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) నాయకులు ఫైర్ సర్వీస్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డిని కోరారు. సోమవారం తిరుపతికి వచ్చిన డీజీని అప్సా నాయకులు కలిసి ఘనంగా సన్మానించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంరాజు మాట్లాడుతూ అగ్నిమాపక శాఖ అనుమతి పత్రాలను ఐదేళ్లకు ఒకసారి కాకుండా శాశ్వత ప్రాతిపదికన జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అప్సా నాయకులు లోకేష్, బాబా రమేష్, మురళి, చంద్ర, రవికుమార్ పాల్గొన్నారు.

ఆత్మ స్థైర్యాన్ని పెంపొందించుకోండి


మాట్లాడుతున్న డాక్టర్ చైతన్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని సాధించాలని పద్మావతి వర్సిటీ ఉమెన్ స్టడీస్ ప్రతినిధి డాక్టర్ చైతన్య పేర్కొన్నారు. వర్సిటీ హ్యూమనిటీస్ సెమినార్ హాల్లో సోమవారం నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతర సాధన ద్వారా సాధనకు ప్రయత్నం చేయాలన్నారు. ఎలాంటి ఒత్తిడికీ లోను కాకుండా ప్రణాళికను రూపొందించుకుని పాటించాలన్నారు. స్విమ్స్ డాక్టర్ గణేష్‌కుమార్ మాట్లాడుతూ భావోద్వేగాల నియంత్రణ ద్వారా అనేక సమస్యలను అధిగమించవచ్చని అభిప్రాయపడ్డారు. ఆత్మనూన్యత వీడి ధైర్యంగా సమావేశాల్లో మాట్లాడే నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు.

కాలం చెల్లిన వృక్షాలను తొలగించండి

తిరుపతి (జీవకోన), నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో కాలం చెల్లిన వృక్షాలను తొలగించాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. తిరుమలలో ఆదివారం రెండు మహావృక్షాలు విరిగి కార్లపై పడడంతో ధ్వంసమయ్యాయని తెలిపారు. భక్తుల భద్రతను దృష్టిలో పెట్టుకుని కాలం చెల్లిన పెద్ద చెట్లను గుర్తించి తొలగించాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

రామాలయంలో హుండీ చోరీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం హరిపురంకాలనీలోని రామాలయంలో హుండీ చోరీకి గురైంది. ఆదివారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడిన దుండగులు హుండీ పగులగొట్టి అందులో ఉన్న రూ.15వేల నగదును అపహరించుకుని వెళ్లారు. సోమవారం ఉదయం గమనించిన కాలనీ పెద్దలు రూరల్ సీఐ చిన్నగోవిందుకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారి కుటుంబానికి ఆర్థిక సాయం

తిరుపతి అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం హత్యాచారానికి గురైన వడమాలపేట మండలానికి చెందిన చిన్నారి కుటుంబానికి మంగళం పరిధిలోని తిరుమలనగర్ పంచాయతీకి చెందిన టీడీపీ సీనియర్ నేత రంగయ్యనాయుడు రూ.10వేలు ఆర్థిక సాయంగా అందించారు. తల్లిదండ్రులను పరామర్శించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. సుశాంత్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు.

సేంద్రియ కూరగాయల విక్రయం



సేంద్రియ ఎరువులతో పండించిన ఆకుకూరలు, కూరగాయలను రైతులు కలెక్టరేట్‌లో సోమవారం విక్రయించారు. పీజీఆర్ఎస్‌లో వినతులు సమర్పించేందుకు వచ్చిన ప్రజలు కొనుగోలు చేశారు.

- తిరుపతి కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)



ముక్కంటి ఆలయంలో రద్దీ

శ్రీకాళహస్తీశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగింది. కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని భక్తుల రద్దీతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 35వేలమంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నట్లు అధికారుల అంచనా.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

తిరునగరిలో భూకైలాస్

● రూపుదిద్దుకుంటున్న మహా నంది-శివలింగ మందిరం
● రూ. 5కోట్ల వ్యయంతో ఎత్తయిన నిర్మాణం
● బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో శివభక్తులకు కానుక



భవనంపై భాగంలో ప్రతిష్ఠించనున్న నంది, శివ పార్వతుల విగ్రహాలు



రూపుదిద్దుకుంటున్న మూడంతస్తుల శివలింగ మందిరం

తిరుపతి అనగానే ఠక్కున వేంకటేశ్వర స్వామి గుర్తుకు వస్తారు. పుణ్యక్షేత్రంగా తిరునగరి ఇప్పుడు మరో ఆధ్యాత్మిక కేంద్రం కొలువుదీరనుంది. ప్రముఖ దర్శనీయ స్థలాల సరసన ఇది చోటు సంపాదించుకోనుంది. భక్తులను పరవశుల్ని చేసేలా అపురూప 'నంది-శివలింగ మందిరం' రూపుదిద్దుకుంటోంది. ఇది దేశంలోనే మూడవదిగా చెబుతున్నారు. రాష్ట్రంలో రెండో ఎత్తయిన శివలింగ మందిరంగా నిలిచేందుకు [illegible] సమాయత్తమవుతోంది. పుట్టపర్తిలో 75 అడుగుల ఎత్తులో ఇదే నమూనాతో శివలింగ మందిరం ఉంది. బ్రహ్మకుమారీస్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతి శివారు మంగళం క్వార్టర్స్ సమీపాన నంది-శివలింగ మందిర నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పదెకరాల విస్తీర్ణంలో బ్రహ్మకుమారీల ఆశ్రమంలోనే ఈ మందిరం ఏర్పాటు కానుంది. 1.25ఎకరాల విస్తీర్ణంలో ప్రశాంత, ఆహ్లాదరకర వాతావరణంలో దాదాపు రూ.5కోట్ల వ్యయంతో మూడంతస్తుల మందిర నిర్మాణాన్ని బ్రహ్మకుమారీస్ సంస్థ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. గతేడాది అక్టోబరులో పనులు మొదలవగా.. ఇప్పటికి సగం పనులు పూర్తయ్యాయి. భక్తులను ఆకట్టుకునేలా మందిరాన్ని నిర్మించేందుకు 50 మంది శిల్పులు నిత్యం శ్రమిస్తున్నారు.

శివలింగమందిర విశేషాలు

భూమట్టం నుంచి 67అడుగుల ఎత్తు, 67అడుగుల [illegible] వెడల్పు చుట్టుకొలత మధ్య మూడు అంతస్తుల్లో శివలింగమందిరాన్ని నిర్మిస్తున్నారు. గ్రౌండ్‌ఫ్లోర్‌లో దేశంలోని ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాలు ఏర్పాటు చేస్తున్నారు. మధ్యలో వేంకటేశ్వర స్వామి నిలువెత్తు విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. మొదటి అంతస్తులో రాజయోగ అభ్యాసనం వీడియో షో ప్రదర్శించనున్నారు. ధ్యానం చేసుకునేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎక్కడా లేని విధంగా లిఫ్ట్ సౌకర్యం కల్పించనున్నారు. మెట్ల సదుపాయం కూడా ఉంటుందని నిర్వాహకులు చెప్పారు.

సిద్ధమవుతున్న భారీ నంది

శివలింగం ముందుభాగాన శివనామాలు, మూడోనేత్రానికి సమాన ఎత్తులో మరో నిర్మాణం చేపట్టారు. దాదాపు 60అడుగుల ఎత్తులో భారీ నంది ఏర్పాటు కానుంది. శివుని మూడో నేత్రం, నంది నయనాలు సమాన కొలతతో ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 24అడుగుల పొడవు, 16అడుగుల ఎత్తుతో భారీ నంది విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

సరికొత్త ఆలోచనలే పెట్టుబడి

● 'అగ్రి'లో అంకుర సంస్థలకు దరఖాస్తుల ఆహ్వానం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వెటర్నరీ వీసీ జేవీ రమణ, ఏడీ రమణ తదితరులు

తిరుపతిరూరల్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అనుబంధ రంగాలలో సరికొత్త ఆలోచనలు కలిగి అంకుర సంస్థలు ఏర్పాటు చేయదలచిన ఔత్సాహికుల నుంచి తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని ఆంగ్రు పోషన్ ఇంక్యుబేటర్ కేంద్రం ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మూడు స్కీమ్‌ల ద్వారా ఈ దరఖాస్తులను కోరుతున్నారు. వినూత్న ఆలోచన వరకే పరిమితమైన వారికి యోచ్ పథకం ద్వారా రూ.5లక్షల వరకు, ప్రోటోటైప్ నమూనా ఉన్న వారికి అగ్రి ఇన్వో ద్వారా రూ.25లక్షల వరకు ఫండింగ్ అందించనున్నారు. ఈ ఏడాది కొత్తగా మెరిస్టమ్స్ స్కీమ్ ప్రవేశపెట్టారు. ఇందులో నూతన ఆలోచనలతో వ్యవసాయ అంకుర సంస్థలు నెలకొల్పేందుకు ఆసక్తి కలిగి ఉన్న విద్యార్థులకు(కోర్సు పూర్తి) రూ.4లక్షల వరకు ఐడియా ఫండింగ్ అందిస్తారు. ఈ పథకాల ద్వారా ఎంపికైన వారికి శిక్షణతో పాటు ఫండింగ్ ద్వారా అంకుర సంస్థల ఏర్పాటుకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తారు. వచ్చేనెల 4వ తేదీతో దరఖాస్తు గడువు ముగియనుంది. ఇతర వివరాల కోసం 'ఏఎన్‌జీఆర్‌ఏయూఆర్‌ఏబీఐటీపీటీ.ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌ను సంప్రదించాల్సి ఉంది. ఈ కేంద్రం ద్వారా నిర్వహించే 8వ బ్యాచ్‌కి సంబంధించిన పోస్టర్లను సోమవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ జేవీరమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ రమణతో ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి కలసి విడుదల చేశారు. ప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కదిరి మోహన్, కోప్రాజెక్ట్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కె.విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో శిక్షణ ప్రారంభం

తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలోని ఆంగ్రు పోషన్ ఇంక్యుబేటర్ కేంద్రంలో సోమవారం 7వ బ్యాచ్ శిక్షణ ప్రారంభించారు. వ్యవసాయ, వెటర్నరీ రంగాలను అనుసంధానిస్తూ కొత్త ఆలోచనలను ప్రోత్సహించాలని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ వీసీ జేవీ రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవీ రమణ, ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ డాక్టర్ వి.సుమతి సూచించారు. వ్యవసాయ ఇంజనీరింగ్‌లో వస్తున్న ఆవిష్కరణలను వివరించారు.

చెంచయ్య మృతదేహానికి రీ పోస్టుమార్టం



పటిష్ట పోలీసుల భద్రత నడుమ పోస్టుమార్టం చేస్తున్న వైద్య బృందం

పెళ్లకూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం చిల్లకూరు వడ్డిపాలెం సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున గత నెల 23న అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బండి చెంచయ్య మృతదేహానికి సోమవారం రీ పోస్టుమార్టం జరిగింది. వడ్డిపాలేనికి చెందిన చెంచయ్య గత నెల 23న మృతి చెందగా 24న నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. నాయుడుపేటలో జరిగిన పోస్టుమార్టంపై తమకు నమ్మకం లేదని, మరోసారి పోస్టుమార్టం చేసి న్యాయం చేయాలని మృతుడి భార్య ప్రమీలమ్మ హైకోర్టును ఆశ్రయించారు. గత నెల 29న హైకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు.. సోమవారం రీపోస్టుమార్టం నిర్వహించారు. నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు పర్యవేక్షణలో తిరుపతి స్విమ్స్ వైద్యులు గ్రామానికి చేరుకుని బంధువులు, తహసీల్దార్ ద్వారకానాథ్‌రెడ్డి సమక్షంలో మృతదేహాన్ని బయటకు తీసి మళ్లీ పోస్టుమార్టం చేశారు. నాయుడుపేట రూరల్ సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ నాగరాజు, ఆర్‌ఐ సంతోషిబాయి, వీఆర్వోలు తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల నియామకాల సమగ్ర సమాచారమివ్వండి

తిరుపతిరూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని ఎస్వీ వెటర్నరీ వర్సిటీలో 2008 ఏప్రిల్1 నుంచి 2024 మార్చి 31 వరకు ఉద్యోగుల నియామకాలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఇవ్వాలని ఏపీ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్)కార్యాలయ సీనియర్ ఆడిట్ అధికారి గత నెల 29న జారీ చేసిన ఉత్తర్వులు ఆలస్యంగా వెలుగుచూసింది. వర్సిటీలో సూపరింటెండెంట్‌గా పనిచేసే జి.చంద్రశేఖర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం.రాజేష్‌రెడ్డిలకు సంబంధించిన సర్వీస్ రికార్డ్‌తో పాటు వీరిద్దరిపై ఏమైనా కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నాయా..? అలా ఉంటే ఫైల్‌తోపాటు కేసుల స్థితివంటి సమాచారాన్ని ఇవ్వాలని ఆదేశించారు. అలాగే వర్సిటీ నిధుల్లో చేసిన డబుల్ పేమెంట్స్, దీనికి సంబంధించి న్యాయపరమైన సమస్యలు, పునరుద్ధరణ వంటి వివరాలు, మెడికల్ ఇన్వాలిడేషన్ పద్ధతిలో చేపట్టిన కంపాజినేట్(కారుణ్య) నియామకాల సమాచారాన్ని అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే అంతకుముందు ఆంగ్రువర్సిటీలో వెటర్నరీ అంతర్భాగంగా ఉన్నప్పుడు చేపట్టిన మెడికల్ ఇన్వాలిడేషన్ నియామకాలపై కోర్టులో కేసు నడుస్తుందని, వీటిపై కూడా విచారణ చేపడితే వాస్తవాలు వెలుగుచూస్తాయని పలువురు ఉద్యోగులు అంటున్నారు. ఏజీ కార్యాలయం నుంచి సమాచారం అడగడంతో పలువురు ఉద్యోగుల్లో ఆందోళన మొదలైందన్న చర్చ వర్సిటీలో నడుస్తోంది.

అది పట్టా భూమే

● అర్బన్ తహసీల్దారు వెల్లడి

తిరుపతి, నవంబరు4 (ఆంధ్రజ్యోతి):తిరుపతి రూరల్ మండలం మంగళం గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబరు 114లో ప్రభుత్వ భూమి కబ్జా అంటూ సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి స్పందించారు. రెవెన్యూ అధికారులను తనిఖీకి పంపామని,షెడ్లు నిర్మించిన స్థలం ప్రైవేట్ వ్యక్తులదని చెప్పారు. అయితే ఆ స్థలంలోకి వెళ్లేందుకు కాలువను దారిగా మార్చుకున్నట్లు ప్రాథమిక సర్వేలో గుర్తించామన్నారు.ఇరిగేషన్ అధికారుల అనుమతి తీసుకుని చేశారా లేదా తెలుసుకునేందుకు మంగళవారం మరోసారి ఇరిగేషన్, రెవెన్యూఅధికారులతో సంయుక్తంగాకాలువ ఆక్రమణ అంశంపై విచారణ జరుపుతామన్నారు.

వినతులకు సకాలంలో పరిష్కారం చూపండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం ● పీజీఆర్‌ఎస్‌కు 181 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్) నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే వినతులకు సకాలంలో పరిష్కారం చూపాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి అర్జీనీ క్షుణ్ణంగా పరిశీలించాలని, పరిష్కారం కాని సమస్యలు ఎందుకు అనేది వివరణాత్మకంగా ఉండాలన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో 181 అర్జీలు అందగా రెవెన్యూ శాఖవే 119 ఉన్నాయి. జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

అగ్రికల్చర్ కళాశాల, హార్టికల్చర్ పరిశోధన కేంద్రం, వెటర్నరీ వర్సిటీలోని కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి జయచంద్ర డిమాండు చేశారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్నా 2012 చట్టం ప్రకారమే జీతాలు అందిస్తున్నారన్నారు. ఆప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి, మునిరాజా, అగ్రికల్చర్ కళాశాల వర్కర్స్ యూనియన్ నాగరత్నమ్మ, మస్తాన్, పరశురామ్ పాల్గొన్నారు.

అత్యాచారాల నివారణకు చర్యలు తీసుకోండి

ఇటీవల కాలంలో పెరిగిపోతున్న అత్యాచారాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు ఐద్వా ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మద్యం, డ్రగ్స్ కారణంగా ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. వడమాలపేట మండలంలో చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జయచంద్ర, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి

తమ గ్రామంలో మేత పోరంబోకు భూములను యథేచ్ఛగా ఆక్రమించేస్తున్నారని ఓజిలి మండలం, మనవాలి గ్రామానికి చెందిన చిన్న పుల్లయ్య ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల సహకారంతో తప్పుడు రికార్డులు సృష్టించి, ఆక్రమించుకున్నారని తెలిపారు. రీసర్వేలోనూఅవకతవకలు జరిగాయని, 2.93సెంట్ల ప్రభుత్వ భూమిని ఆక్రమార్కులు తమ పేరుతో బదలాయించుకున్నారని వివరించారు. దీనిపై విచారణ జరపాలని విన్నవించారు.



సైబర్ క్రైం అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ

డిజిటల్ ప్రపంచంలో జాగ్రత్తగా ఉండాలి : ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(ఆంధ్రజ్యోతి): డిజిటల్ ప్రపంచంలో ప్రతి అడుగూ జాగ్రత్తగా వేయాలని, సమాజాన్ని సురక్షితంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఎస్పీ సుబ్బరాయుడు కోరారు. పద్మావతి మహిళా వర్సిటీ ఆడిటోరియంలో సోమవారం సైబర్ క్రైం వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దైనందిన జీవితంలో ఇంటర్నెట్, స్మార్ట్ మొబైల్, కంప్యూటర్ భాగమైపోయాయని, దీన్ని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు సులభంగా బురిడీ కొట్టిస్తున్నారన్నారు. దీనిపై విద్యార్థులు అవగాహన పెంచుకుని తోటి వారిని చైతన్యపరచి సైబర్ నేరాల నియంత్రణకు సహకరించాలని కోరారు. యువత, ఉద్యోగులు, మహిళలు, ఐటీ నిపుణులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వీసీ ఉమ కోరారు. అవసరం లేని యాప్‌ల పట్ల జాగ్రత్త వహించాలని సైబర్ క్రైం నిపుణుడు ఐఎల్ నరసింహారావు సూచించారు. అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవి మనోహరాచారి, మహిళా వర్సిటీ రిజిస్ట్రార్ రజని, డీఎస్పీలు వెంకటనారాయణ, శ్రీలత, మహిళా విశ్వవిద్యాలయం ఆచార్యులు, పోలీసు అధికారులు, సైబర్ క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

రోజావి నిరాధార ఆరోపణలు

● ఆమెను అరెస్టు చేయాలంటూ తెలుగు మహిళల ఫిర్యాదు



రోజాపై ఎస్‌ఐకి ఫిర్యాదు అందజేస్తున్న తెలుగు మహిళలు

పుత్తూరు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వంపై నిరాధార ఆరోపణలు చేసిన మాజీ మంత్రి రోజాను వెంటనే అరెస్టు చేయాలని తెలుగు మహిళలు డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం పుత్తూరు ఎస్‌ఐ ఓబయ్యకు ఫిర్యాదు చేశారు. 'టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులు ఆడపిల్లల్ని రేప్ చేస్తుంటే, తగలబెడుతుంటే, ముక్కలు ముక్కలుగా నరికేస్తుంటే ముఖ్యమంత్రి చంద్రబాబు, హోంమంత్రి అనిత కేసులు పెట్టడం లేదు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏమి చేస్తున్నాడు' అంటూ రోజా నిరాధార ఆరోపణలు చేశారని చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీప్రసన్న తప్పుపట్టారు. మూడున్నరేళ్ల చిన్నారి అఘాయిత్యానికి గురై.. తల్లిదండ్రులు గర్భశోకంలో ఉంటే మంత్రి రోజా ఆస్పత్రి వద్ద రాజకీయాలు మాట్లాడటం దారుణమన్నారు. గత ప్రభుత్వ గంజాయి మూలాలతోనే ఇప్పుడు జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు టీడీపీ ప్రధాన కార్యదర్శి ధనపాల్, తెలుగు మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ బసంతి, కౌన్సిలర్ భువనేశ్వరి, భారతి, నాగరత్న, రజినీ, మోహన తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఏపీ యునైటెడ్ ఆశ్కా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కుమార్‌రెడ్డి, జిల్లా గౌరవాధ్యక్షుడు మునేంద్ర మాట్లాడుతూ గ్రామీణుల ఆరోగ్య విషయంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తారని, అలాంటి వారికి రూ.10వేలు గౌరవ వేతనం ఇచ్చి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని అన్నారు. జీతాలు పెంచి, పనిఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జహీరా, జిల్లా అధ్యక్షురాలు కవిత మాట్లాడుతూ ఆశావర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రసూతి సెలవులు 3 నెలలు ఇవ్వాలని కోరారు. ఆశా వర్కర్లు పద్మావతి, లక్ష్మమ్మ, సుందరమ్మ, శారద, అమరావతి, సుగుణ, మంగమ్మ, సరిత పాల్గొన్నారు.



బాధితుడు సుబ్బన్న

మీ సర్వేయరే నా స్థలం కబ్జా చేశాడు

● గ్రీవెన్స్‌లో ఆర్డీవో వద్ద బాధితుడి ఆవేదన

తిరుపతి, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'మీ దగ్గర పనిచేసే సర్వేయరే నా స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు కట్టేసుకున్నాడు. తహసీల్దారు కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా న్యాయం జరగడంలేదు. మీరైనా సర్వే చేయించి న్యాయం చేయండి' అంటూ ఆర్డీవో రామ్మోహన్ ముందు ఓ బాధితుడు ఆవేదన చెందారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్‌ఎస్‌లో రూరల్ మండలం అవిలాల గ్రామానికి చెందిన వి.సుబ్బన్న వినతి పత్రం అందజేశారు. డాక్యుమెంట్లు పరిశీలించిన ఆర్డీవో ఇప్పటి ఈసీ తీసుకొస్తే జిల్లా సర్వే ఇన్‌స్పెక్టర్‌తో సర్వే చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా బాధితుడు సుబ్బన్న 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. 'అవిలాల గ్రామ లెక్కదాఖలా సర్వే నెంబరు 28/3లో 10 సెంట్లు, 28/4లో 0.39 సెంట్లు, 28/2లో 27 సెంట్లు స్థలం అనువంశికంగా మా స్వయార్జితం. 28/3లో చిట్టిబాబు అనే సర్వేయర్‌కు 30 అంకణాల భాగం విక్రయించాను. ఆ స్థలాన్ని వేరేవాళ్లకు విక్రయించేసి, 28/4లో నేను నిలుపుకొన్న స్థలాన్ని ఆక్రమించి 40 అంకణాలకు పైగా ఇల్లు నిర్మించుకున్నాడు. సదరు స్థలాలను సర్వే చేయడానికి రూరల్ తహసీల్దారును పలుసార్లు కోరినా సర్వేయర్లు ముందుకు రావడంలేదు. సర్వే నివేదిక ఇవ్వడంలేదు. అతడు సర్వేయర్ కావడంతో ఇతర సర్వేయర్లు నాకు సహకరించడంలేదు. గత వారం గ్రీవెన్స్‌కి వచ్చినప్పుడు తనపై దాడి చేస్తున్నానని నాపై సర్వేయర్ చిట్టిబాబు పోలీసులకు ఫిర్యాదు చేసి, ఆర్డీవోను కలవనీయకుండా చేశారు. జిల్లా సర్వేయర్ ద్వారా 28/3, 28/4 నెంబర్లకు సర్వే జరిపి మాకు హద్దులు చూపించాలని కోరుతున్నా' అని విజ్ఞప్తి చేశారు. దీనిపై చిట్టిబాబును వివరణ కోరగా తాను కొనుగోలు చేసిన స్థలంలోనే ఇల్లు నిర్మించుకున్నానని చెప్పారు.

పుత్తూరు వార్తలు

బెంబేలెత్తిస్తున్న బైక్ చోరీలు

- వేకువజామున 3- 5 గంటల మధ్య..
- ఆరుబయట ఉన్న వాహనాలే లక్ష్యం
- గడిచిన రెండు నెలల్లో 16కు పైగా చోరీ
- తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు


వాహన తనిఖీల సందర్భంగా రికార్డులు చూపమంటున్న పోలీసులు

పుత్తూరు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ద్విచక్రవాహనాల చోరీ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తోంది. పెరుగుతున్న పుత్తూరు పట్టణానికి అనుగుణంగా పార్కింగ్‌కు అవసరమైన స్థలం లేదు. ఈ కారణంగా 90 శాతం వాహనదారులు తమ ద్విచక్ర వాహనాలను ఆరుబయటనే పార్కింగ్ చేస్తున్నారు. బైక్ చోరీలకు పాల్పడే వారికి ఇది అవకాశంగా మారింది. గడిచిన రెండు నెలల్లో 16కు పైగా ద్విచక్రవాహనాలు చోరీకి గురైనట్టు ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ క్రమంలో సీఐ సురేంద్రనాయుడు ఆధ్వర్యంలో క్రైం పార్టీ పోలీసులను రంగంలోకి దిగారు. అంతే కాకుండా సివిల్ పోలీసులు కూడా జల్లెడ పడుతున్నారు. వాహనాలను నిత్యం తనిఖీ చేస్తున్నారు. సోమవారం కూడా ఎస్ఐ ఓబయ్య ప్రత్యేకంగా ద్విచక్ర వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహన పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. చోరీ అయిన వాహనాలు వేరే నెంబర్లతో ఇక్కడే తిరుగుతున్నారనే సమాచారంతో తనిఖీలు ముమ్మరం చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మరోవైపు క్రైం బ్రాంచ్ పోలీసులు ప్రత్యేకంగా ఈ చోరీ పని తమిళనాడుకు చెందిన గ్యాంగ్ పనేనంటూ ఆ దిశగా విచారణ ముమ్మరం చేశారు మరోవైపు ఇకపై చోరీలు జరగకుండా పరిసర ప్రాంతాల్లో గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నారు. ఇంటి ముందు వాహనాలను పార్కింగ్ చేసుకునే క్రమంలో ఇంటి బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

వైభవంగా కార్తీక సోమవార పూజలు


విశేష అలంకరణలో భవానీ శంకరుడు - పుత్తూరు సదాశివేశ్వర ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

వడమాలపేట, నవంబర్ 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు శివాలయాల్లో కార్తీక మాసం మొదటి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భవానీ శంకర ఆలయంలో వేకువ జామున మహాలింగానికి పంచామృతాభిషేకం నిర్వహించారు. పట్టుపీతాంబరాలు, పూలమాలలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మండల పరిధిలోని సదాశివకోనలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు జాలువారే జలపాతంలో కార్తీక స్నానాలు ఆచరించి తడిబట్టలతో స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే అప్పలాయగుంట చంద్రమౌళీశ్వరస్వామి, ఓబీఆర్ కండ్రిగలోని ఉమామహేశ్వర స్వామి, వడమాలపేటలోని గౌరీశంకర ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు ఆలయాల్లో నేతి దీపాలు వెలిగించి దీప దర్శనం చేసుకున్నారు. ఉసిరి చెట్లకు పూజలు చేశారు. **పుత్తూరు టౌన్**: కార్తీక మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని సదాశివేశ్వర ఆలయంలో మహిళలు పెద్ద ఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. అలాగే పట్టణంలోని పలు శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి.

రుణ లభ్యత, ఉత్పాదకతకే గ్రామీణ బ్యాంకులు

పుత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో రుణ లభ్యత, ఉత్పాదకతను పెంచేందుకు గ్రామీణ బ్యాంకులు తోడ్పడుతాయని ప్రాంతీయ మేనేజర్ లక్ష్మీపతి అన్నారు. పుత్తూరు డిగ్రీ కళాశాలలో వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో గ్రామీణ బ్యాంకులపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సన్నకారు రైతులు, వ్యవసాయ కార్మికులు, చేతివృత్తుల వారికి రుణాల మంజూరు, బ్యాంకింగ్ సదుపాయాలను గ్రామీణ బ్యాంకులు అందుబాటులోకి తెస్తాయన్నారు. మేనేజర్లు సంగీత, శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు దేవకి, వాసవి, తిరుమలయ్య, గంగయ్య పాల్గొన్నారు.

విజిలెన్స్ మానిటరింగ్ సమావేశాలు నిర్వహించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పుత్తూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను, పౌరహక్కుల దినోత్సవాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని సోమవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి మునివేలు తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిటీ సిఫార్సుల మేరకు వీటిని నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివయ్య, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


శ్రీసిటీ వద్ద వాహన తనిఖీలు

పుత్తూరు అర్బన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా తిరుగుతున్న వాహనాలకు పుత్తూరు ఎంవీఐ చంద్రశేఖర్ జరిమానా విధించారు. సోమవారం సత్యవేడు సమీపంలోని శ్రీసిటీలో వాహన తనిఖీలు చేపట్టారు. రెండు రోజులుగా చేపట్టిన తనిఖీల్లో ఫిట్‌నెస్‌తో పాటు ఇన్సూరెన్స్ లేని వాహనాలు ఎక్కువగా పట్టుబడ్డాయని ఆయన తెలిపారు. పట్టుబడిన వాహనదారుల నుంచి రూ.4 లక్షల జరిమానా వసూలు చేసినట్లు పేర్కొన్నారు. సకాలంలో వాహన పన్నులు చెల్లింపులతో పాటు ఫిట్‌నెస్ చేయించుకుని రహదారులపై ప్రయాణించాలని వాహనదారులకు సూచించారు.

అసాంఘిక కార్యకలాపాలపై నిఘా

పుత్తూరు టౌన్, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తమిళనాడు, ఆంధ్ర సరిహద్దు రైల్వేస్టేషన్లు, పుత్తూరు, నగరి వద్ద అసాంఘిక కార్యక్రమాలపై ఉక్కుపాదం మోపడానికి పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు రేణిగుంట రైల్వే డీఎస్సీ ఎస్ఆర్ హర్షిత తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె పుత్తూరు రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేశారు. అక్రమ రవాణా, అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ యశ్వంత్, ఎస్ఐ రవికుమార్, రైల్వే పోలీసులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి


నాయుడుపేట శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


గూడూరు: శివాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీక పూజలు

గూడూరు, వెంకటగిరి టౌన్, నాయుడుపేట టౌన్, తడ, సూళ్లూరుపేట, కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. గూడూరు పట్టణంలోని శివాలయం, వీరభద్రస్వామి, సంఘమేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు కార్తీకదీపాలను వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. శివాలయంలో శివపార్వతులకు పల్లకీసేవ నిర్వహించారు. ● వెంకటగిరి పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిక్కిరిసిశాయి. పట్టణంలోని కాశీ విశ్వనాధస్వామి, రామలింగేశ్వర స్వామి, కర్ణకమ్మ వీధిలోని హర హరక్షేత్రం, వల్లివేడు క్రాస్ వద్ద మల్లిఖార్జున భ్రమరాంబిక ఆలయాల్లో మహిళలు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ● నాయుడుపేట పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసన్నాంబ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే మహిళలు ఆలయానికి చేరుకొని పిండిదీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక సోమవారం కావడంతో మహిళలు, అయప్పస్వామి మాలధారణ భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. ● తడ మండలం చిన్నమాంబట్టులో ఉన్న అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామి వార్లకు విశేష పూజలు జరిగాయి. మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించారు. గోపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయంలో కోలాట నృత్యాలను ప్రదర్శించారు. అలాగే బోడిలింగాలపాడు వద్ద ఉన్న భువనేశ్వరస్వామికి 101 లీటర్లతో పాలతో అభిషేకం చేశారు. ● సూళ్లూరుపేటలోని శివాలయాల్లో కార్తీక మాస తొలి సోమవారం సందర్భంగా మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. నాగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి విశేష పూజలు జరిపారు. అదేవిధంగా మన్నారు పోలూరు సంతానేశ్వరస్వామి, కల్యాణేశ్వరస్వామి ఆలయాలు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. ● కోట మండల పరిధిలోని గూడలిలోని కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడు, గూడలి తిప్పపై వెలసిన పర్వతవర్ధిని సమేత భీమేశ్వరి ఆలయాల్లో సోమవారం కార్తీకమాస పూజలు జరిగాయి. ఆయా ఆలయాల్లో వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహాలకు పలు అభిషేకాలు జరిగి విశేషంగా అలంకరించారు. ప్రధానార్చకులు కార్తీక్‌స్వామి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గార్ల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సంఘమేశ్వరుడు, కామాక్షిదేవి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సంఘమేశ్వరుడి స్వామివారి తీర్థాన్ని మేళతాళాలతో తీసుకెళ్లి తిప్పపై వెలసిన భీమేశ్వర విగ్రహానికి అభిషేకం చేశారు.


గూడూరు శివాలయంలో శివపార్వతులకు పల్లకీసేవ


కోట: ప్రత్యేక అలంకరణలో సంఘమేశ్వరుడు - నాయుడుపేట శివాలయంలో అయ్యప్పస్వామి భక్తులు - సూళ్లూరుపేట: నాగేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న మహిళలు

నాయుడుపేట రైల్వే స్టేషన్‌ను అమృత్‌భారత్ పథకంలో చేర్చండి


ఎంపీ సీఎం రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న సదరన్ రైల్వే అసోసియేషన్ సభ్యులు

నాయుడుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట రైల్వేస్టేషన్‌ను అమృత్‌భారత్ స్కీమ్‌లో చేర్చాలని రైల్వే ప్యాసింజర్ అసోసియేషన్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి కోరారు. సోమవారం రేణిగుంటలో ఎంపీ సీఎం రమేష్‌ను మర్యాద పూర్వకంగా కలసి వినతిపత్రం అందజేశారు. నాయుడుపేట సమీపంలో మేనకూరు సెజ్ ఉండడంతో వివిధ రాష్ట్రాల ప్రయాణికులు స్థానిక రైల్వే స్టేషన్ నుంచి రాకపోకలు సాగిస్తుంటారని తెలిపారు. అలాగే సూళ్లూరుపేట వరకు నడుపుతున్న మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించాలని తెలిపారు.

ఉపాధి కూలీలకు పని కల్పించండి

గూడూరు అర్బన్, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలంలో ఉపాధి కూలీలకు వందరోజులు పని కల్పించాలని సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జి శశికుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లకూరు మండలంలో ఏపీవో సక్రమంగా పనులు కల్పించకపోవడంతో కూలీలకు అవస్థలు పడుతున్నారన్నారు. నంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చంద్రయ్య, అంకయ్య, మస్తానయ్య, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సహజ వనరులను కాపాడండి

ఓజిలి, నవంబరు 4: ఓజిలి మండలం ఆరిమేనిపాడు పరిసర ప్రాంతాల్లోని సహజ వనరులను కాపాడాలని ఆ గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామానికి చుట్టుప్రక్కల మేత పరంబోకు భూములు, తిప్పలు ఉండడం వల్ల భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కొందరు ఇక్కడి తిప్పను గ్రావెల్ పేరుతో తరలించేందుకు ప్రయత్నించగా గ్రామస్తులంతా అడ్డుకున్నామని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనూ కొందరు ఇక్కడి తిప్పను తవ్వి తరలించే ప్రయత్నం చేస్తున్నారని, వారిని అడ్డుకోవాలని రెవెన్యూ అధికారులను కోరారు.

గూడలిలో టీడీపీ సభ్యత్వ నమోదు

కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో సోమవారం టీడీపీ సభ్యత్వం నమోదు ముమ్మరంగా సాగింది. టీడీపీ ఎస్సీసెల్ మాజీ ఉపాధ్యక్షుడు యల్లశిరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గూడలి, దళితవాడ, బీసీ కాలనీల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు.

నేడు బీవీపాళెంలో సునామీపై మాక్‌డ్రిల్

తడ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సునామి విపత్తును ఎలా ఎదుర్కోవాలో తెలిపేలా మాక్ డ్రిల్‌ను బీవీపాళెం గ్రామంలో మంగళవారం నిర్వహించ నున్నారు. సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో ఎన్‌డీఆర్ బృందాలు పాల్గొంటాయని తహసీల్దారు శరత్‌బాబు తెలిపారు.

వ్యవస్థలను భ్రష్టు పటించిన వైసీపీ: హోం మంత్రి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 4(నవంబరు): గడిచిన ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను భ్రష్టుపట్టించిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. రుషికొండ ప్యాలెస్ ఎవరి కోసం నిర్మించారో జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి కపిలతీర్థంలోని శివాలయాన్ని ఆమె దర్శించుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో బాబు, పురోహితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శన భాగ్యం కల్పించి, వేద పండితులతో వేద ఆశీర్వచనాలు అందించారు. తీర్థప్రసాదాలు అందచేశారు. ఆలయం వెలుపల మంత్రి మీడియాతో మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లింగ్ నివారణకు గట్టి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మంత్రి వెంట అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, అధికారులు ఉన్నారు.

13మంది పేకాటరాయుళ్ల అరెస్టు
రూ.1.54లక్షల స్వాధీనం

తిరుచానూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో ఓ హోటల్‌పై పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 13మందిని అరెస్టు చేశారు. సీఐ సునీల్‌కుమార్ తెలిపిన మేరకు.. తిరుచానూరు బైపాస్‌రోడ్డులోని స్ప్రింగ్ హిల్స్ హోటల్‌లో కొందరు పేకాడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. హోటల్‌లో సోదాలు నిర్వహించగా 13మంది పట్టుబడ్డారు. వారి నుంచి రూ.1.54లక్షలు నగదు సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. పోలీసు అదుపులోకి తీసుకున్న వారిలో అధికార ప్రతిపక్షాలకు చెందిన నేతలు, వ్యాపారస్థులు ఉన్నట్లు తెలిసింది. గతంలో కూడా ఇదే హోటల్‌లో పేకాట ఆడుతూ పలువురు చిక్కారు. అలాగే చెంచులక్ష్మి యానాది కాలనీలో పేకాడుతున్న నలుగురిని అదుపులోకి రూ.5,300 సీజ్ చేశారు.

వైసీపీ కౌన్సిలర్‌పై కేసు నమోదు

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 20వ వార్డు వైసీపీ కౌన్సిలర్ మునీంద్రబాబుపై పోలీసులు కేసు నమోదు చేశారు. తన విధులకు భంగం కలిగించడంతో పాటు కులం పేరుతో దూషించారని రాఘవయ్యపేట వీఆర్వో నీలిమ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు.

లేఅవుట్ యజమానులకు నోటీసులు

దక్కిలి, నవంబరు 4: (ఆంధ్రజ్యోతి): దక్కిలి మండలం లింగసముద్రం గ్రామం వద్ద నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన లేఅవుట్ యజమానులకు పంచాయతీ కార్యదర్శి సోమవారం నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా లింగసముద్రం వద్ద లేఅవుట్ వేయడం చర్చనీయాంశంగా మారింది. సోమవారం అధికారులు నోటీసులు జారీ చేయడంతో లేఅవుట్ పనులు ఆగిపోయాయి. నోటీసులు అందుకొన్న మూడు రోజుల్లోగా తగు ఆధారాలు చూపకపోతే చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి పేర్కొన్నారు.

షార్‌లో హిందీ భాషా వేడుకలు


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న షార్ డైరెక్టర్

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో సోమవారం హిందీ భాషా వేడుకలు నిర్వహించారు. హిందీని జాతీయ భాషగా గుర్తించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ ఏడాదిని డైమండ్ జూబ్లీ ఇయర్‌గా జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో షార్‌లోని బ్రహ్మప్రకాష్ హాలులో షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి హిందీ భాషా వేడుకలను ప్రారంభించారు. షార్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం షార్ డైరెక్టర్, సీనియర్ ఉద్యోగుల చేతుల మీదుగా ప్రజ్వాల్ హిందీ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షార్ అసోసియేట్ డైరెక్టర్ సయ్యద్ హమీద్, కంట్రోలర్ శ్రీనివాసులురెడ్డి, గ్రూపు డైరెక్టర్ గోపికృష్ణ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెళ్లకూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - రేణిగుంట జాతీయ రహదారిలోని పెన్నేపల్లి వద్ద ఎస్ఐ నాగరాజు తన సిబ్బందితో సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల రికార్డులను పరిశీలించి డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమాన విధించారు.

చంద్రబాబును కలిసిన పనబాక దంపతులు


సీఎం చంద్రబాబును సత్కరిస్తున్న పనబాక దంపతులు

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని మాజీ కేంద్రమంత్రి పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య దంపతులు సోమవారం అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ బోర్డులో పనబాక లక్ష్మికి స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

రైల్వేగేటు మూసివేత

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం నడిబొడ్డులో ఉన్న రైల్వేగేటును సోమవారం రాత్రి రైల్వే అధికారులు మూసివేశారు. రైల్వేగేటు సమీపంలో మరమ్మతుల కోసం నాలుగు రోజుల పాటు ఈ నెల 7వ తేదీ వరకు గేటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ఈ గేటు మీదుగా వెళ్లే ద్విచక్ర వాహనాలు ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లాలని సూచించారు.

ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు

తిరుపతిరూరల్, నవంబరు4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్కృత వర్సిటీలో నిర్వహించిన విజిలెన్స్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని కోరారు. సంస్కృత భాషలోని మహోన్నత విషయాలను దైనందిన జీవితంలో అన్వయించడం ద్వారా అవినీతి రహిత దేశాన్ని నిర్మించుకోవచ్చని చెప్పారు. ఇందులో భాగంగా నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో తొలిమూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

కాలుష్యం నుంచి చెరువులను కాపాడాలి


సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం నాయకుల ధర్నా

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం కడివేడు చెరువులో వ్యర్థాలను కలుపుతుండడంతో కాలుష్యభరితంగా మారుతోందని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి హేమలత మాట్లాడుతూ కొందరు పోర్టు నుంచి కెమికల్స్ వ్యర్థాలను తెచ్చి కడివేడు చెరువులో కలుపుతున్నారన్నారు. దీనివల్ల చెరువులో నీళ్లు కలుషితమై చేపలు చనిపోతున్నాయని, వాటిని తింటున్న గ్రామస్తులు అనారోగ్యానికి లోనవుతున్నారన్నారు. కలుషిత జలాలు తాగుతున్న మూగజీవాలు సైతం అనారోగ్యాని లోనై మృత్యువాత పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కడివేడు, కమ్మవారిపాళెం, ముత్యాలపాడు తదితర చెరువుల్లో కూడా పరిస్థితి నెలకొందన్నారు. వ్యర్థాల కారణంగా చెరువుల్లో కలుషితం అవుతున్న నీటితో పంటలు సాగు చేసినా సరైన దిగుబడులు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. పలుమార్లు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి చెరువులను కాలుష్యం నుంచి కాపాడాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్, సాయిరెడ్డి, కృష్ణారెడ్డి, జోగి శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, ముత్యాలయ్య, శ్రీనివాసులు, చంద్రయ్య, శంకరయ్య, నారాయణ పాల్గొన్నారు.

షటిల్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ


షటిల్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

గూడూరు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ఓపెన్ ప్రభాకరన్ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో గూడూరు క్రీడాకారులు ప్రతిభచాటారు. చెన్నైలో ఆదివారం జరిగిన తమిళనాడు ఓపెన్ ప్రభాకరన్ షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో గూడూరు హెచ్‌డీ ఎరినా స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు అండర్-15 విభాగంలో షాహీర్, అండర్ -9, అండర్ -11 విభాగంలో యశ్విన్ విజేతలుగా నిలిచారు. గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, కోచ్ హర్షవర్ధన్‌రెడ్డి క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

ఎన్‌బీకేఆర్‌లో అధ్యాపక శిక్షణ తరగతులు

కోట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ సహకారంతో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో అటల్ అధ్యాపక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ తరగతులను ప్రారంభించారు. అప్లికేషన్స్ ఆఫ్ ఫ్రైవేట్ ఎలిమెంట్ అనాలసిస్ ఇన్ ఆడిట్యూ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ ప్రాసెస్స్ అనే అంశంపై ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు జరుగుతాయి. కార్యక్రమంలో విభాగాధిపతులు డాక్టర్ రవిశంకర్, డాక్టర్ విక్రమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగల ధర్మయుద్ధ సభను జయప్రదం చేయండి

సూళ్లూరుపేట, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 14న జరిగే మాదిగల ధర్మయుద్ధ సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ నాయకుడు రవి పిలుపునిచ్చారు.

నైపుణ్యాల సర్వేపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సచివాలయ కార్యదర్శులు

ఓజిలి, నవంబరు 4: మండల పరిధిలోని గ్రామాల్లో వివిధ అంశాల్లో నైపుణ్యం ఉన్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నట్లు డీఎల్‌డీవో జాలిరెడ్డి తెలిపారు. ఓజిలి మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన ఎంపీడీవో విజయలక్ష్మితో కలిసి సచివాలయ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 18-59 ఏళ్ల మధ్య వయస్కుల వారు ఏఏ రంగాల్లో నైపుణ్యం కలిగి ఉన్నారో సర్వే చేసి నమోదు చేయాల్సి వుంటుందన్నారు. కార్యదర్శులు క్లస్టర్ వారీగా గ్రామాల్లో సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో ఉషారాణి, ఏపీఎం పద్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాఫియాను కట్టడి చేసినందుకే గంగాప్రసాద్‌పై ఆరోపణలు

టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీపతిబాబు

సత్యవేడు, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా ఇసుక, గ్రావెల్, మట్టి దందాలపై పెత్తనం చెలాయించిన మాఫియా ఆటలు సాగనివ్వకుండా కట్టడి చేసినందుకే పారిశ్రామికవేత్త, టీడీపీ నాయకుడు గంగాప్రసాద్‌పై తప్పుడు ఆరోణలతో బురదచ ల్లేందుకు ప్రయత్నిస్తున్నారని నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీపతిబాబు అన్నారు. ఇటీవల వైసీపీ అనుకూల మీడియాలో సూళ్ళూరుపేటకు చెందిన పారిశ్రామికవేత్త గంగాప్రసాద్ సత్యవేడు నియోజకవర్గంలో పెత్తనం చెలాయిస్తున్నారని వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై స్పందించిన శ్రీపతిబాబు విలేకరుల సమావేశం నిర్వహించారు. గంగాప్రసాద్ 30 ఏళ్లగా రాజకీయాల్లో ఉన్నారన్నారు. ఏనాడు పదవులు ఆశించకుండా పార్టీకి నిస్వార్థంగా సేవ చేస్తున్నారని చెప్పారు. గత వైసీపీ పాలనలో ఇసుక, గ్రావెల్, క్వారీలపై పెత్తనం చెలాయించిన మాఫియా కళ్లల్లో ఆనందం చూసేందుకే ఇలాంటి చౌకబారు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇలాంటి వార్తలు ప్రచురిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులుయాదవ్, రామాంజులనాయుడు, గోపీనాథ రెడ్డి, తిరుమలరెడ్డి, పరమశివం, నరసరాజు, ఎం.డి.కుమార్, షణ్ముగం, చిన్న తదితరులు పాల్గొన్నారు.

సీఆర్ఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి



రేణిగుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): సీఆర్ఎస్‌లో పనిచేస్తున్న రైల్వే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌కు తాజ్ హోటల్ వద్ద సీఆర్ఎస్ మజ్దూర్ యూనియన్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. హెచ్ఆర్ఏ 10శాతం నుంచి 20 శాతం పెంచాలని సహా పలు సమస్యలను విన్నవించారు. ఈ కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ నాయకులు మునికుమార్, బాబు, సదాశివరెడ్డి, మునిరాజయ్య, చంద్రనాయక్, తిలక్‌కుమార్‌రెడ్డి, గాండీవం తదితరులు పాల్గొన్నారు.

ఆ భూములను కొనుగోలు చేయకుండా చర్యలు తీసుకోండి



ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో దళిత, గిరిజన భూములను కొనుగోలు చేయకుండా చూడాలని సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం వారు ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు తులసీరాజన్, జిల్లా సహాయ కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ... శ్రీకాళహస్తి నియోజకవర్గంలో కొంతమంది గ్రూపులుగా ఏర్పడి దళిత, గిరిజన భూములను గుర్తించి వారికి ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.2లక్షలు చెల్లించి కొనుగోలు చే స్తున్నారన్నారు. దళిత, గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన భూముల క్రయవిక్రయాలపై నిషేధం విధించాలని ఆర్డీవోను కోరారు. రాజయ్య, మణి, వెంకటమ్మ, వినాయక, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం ఇద్దరి అరెస్టు

రేణిగుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ నరసానాయుడు తెలిపిన వివరాలు... రేణిగుంట పట్టణంలోని సంత గేటు సమీపంలో తనిఖీ నిర్వహించి పట్టణానికి చెందిన కృష్ణకుమార్‌నుంచి 20 సీసాలు, అలాగే ఉప్పరపల్లి వద్ద పురుషోత్తంనుంచి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. వారిని అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

బంగారు గొలుసు దోపిడీ కేసులో బాలుడి అరెస్టు

రేణిగుంట, నవంబరు 4: మహిళ మెడలో బంగారు గొలుసు దోపిడీ చేసిన బాలుడిని అరెస్టు చేసినట్లు రేణిగుంట రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ రవి సోమవారం తెలిపారు. రైల్వే క్వార్టర్స్‌లో కాపురం ఉంటున్న రాజేశ్వరి ఫుట్ ఓవర్ బ్రిడ్జి నుంచి ఇంటికి వెళుతుండగా అక్టోబరు 31న ఆమె మెడలోని బంగారు గొలుసును దోపిడీ చేశాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం బాలుడిని అదుపులోకి తీసుకుని 16గ్రాముల బంగారు చైను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిని కోర్టుకు తరలించగా న్యాయమూర్తి జువైనల్ హోంకు తరలిస్తూ తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ తెలిపారు.

అధికారుల పర్యటన

ఏర్పేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవమాలలో అభివృద్ధి పనుల నిమిత్తం అధికారులు పర్యటించారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంక్ మరమ్మతులు, క్లోరినేషన్‌కు ఏఈ సుబ్రహ్మణ్యం పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఇంజనీర్ అసిస్టెంట్ శాలినికి తగు సూచనలు ఇచ్చారు. ప్రమాదకరంగా ఉన్న బావిని పరిశీలించి ఐరన్ గ్రిల్ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. రెండు చేతిపంపులు మరమ్మతులకు గురైనట్లు గుర్తించారు.

సకాలంలో రేషన్ అందించండి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎండీయూ ఆపరేటర్లు రేషన్ సరుకులను సకాలంలో కార్డుదారులకు అందించాలని తహసీల్దార్ సుబ్రమణ్యం ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు డీలర్లు మాట్లాడుతూ... కందిపప్పు, చక్కెర ఇతర వస్తువులు పూర్తిస్థాయిలో రావడం లేదన్నారు. ఎండీయూ ఆపరేటర్లు ప్రతి రోజూ వాహనాల ద్వారా ఉదయం 7గంటల నుంచే సరకులను అందించి ఫొటోలను అప్‌లోడ్ చేయాలని తహసీల్దార్ ఆదేశించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి భారతి సోమవారం తనిఖీ చేశారు. నిల్వలతో పాటుగా పురుగుమందులపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఎమ్మార్పీకే యూరియా తదితరుల ఎరువులు విక్రయించాలన్నారు.

కంకర టిప్పర్ బోల్తా

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): అదుపు తప్పి కంకర టిప్పర్ రోడ్డుపక్కన ముళ్లపొదల్లో బోల్తా పడింది. ఈ ఘటన తొట్టంబేడు మండలం కనపర్తిలో చోటు చేసుకుంది. అయితే ప్రమాదంలో ఏవరూ గాయపడలేదు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఇసుక ట్రాక్టర్

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇసుక ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటన తొట్టంబేడు మండలం పెన్నలపాడు వద్ద సోమవారం సాయంత్రం జరిగింది. పెన్నలపాడు సమీపంలోని స్వర్ణముఖి నది నుంచి ఇసుక ట్రాక్టర్లు శ్రీకాళహస్తి పట్టణానికి బయలుదేరాయి. ఈ క్రమంలో పెన్నలపాడు వద్ద రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వరదరాజులు నాయుడిని ట్రాక్టర్ ఢీకొంది. దీంతో రైతు రోడ్డు పక్కన అడుసుపొలంలో పడటంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. అయితే ఇసుక ట్రాక్టర్లను స్థానికులు అడ్డుకున్నారు. అతివేగంగా నడుపుతుండటంతో ఇబ్బందులకు గురవుతున్నామని సోషల్ మీడియాలో షేర్ చేశారు.

కూరగాయలను విరివిగా పండించండి

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో కూరగాయలను విరివిగా పండించాలని ఇవి ఆరోగ్యానికి మేలు చేస్తాయని ఎంపీడీవో త్రివిక్రమరావు చెప్పారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో సోమవారం కూరగాయల విక్రయాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ... మండలంలోని గాజుల పెళ్లూరు, అలత్తూరు, వీఎస్‌పురం, కనమనంబేడు తదితర గ్రామాల్లో రైతు సాధికారిత సంస్థ ఆధ్వర్యంలో పలువురు రైతులు కూరగాయలు, వరిని ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్నట్లు చెప్పారు. ఈవోపీఆర్డీ రాజశేఖర్, రిసోర్సు పర్సన్లు పాల్గొన్నారు.

త్రయంబకేశ్వరుడికి ప్రత్యేకపూజలు

వరదయ్యపాళెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో సోమవారం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.స్వామివారికి అభిషేకలు నిర్వహించారు. మహిళలు దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ముక్కంటి సేవలో కిరాక్ ఆర్పీ



శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడిని సోమవారం కిరాక్ ఆర్పీ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రేణిగుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం ఈనెల 5న మంగళవారం జరుగుతుందని ఎంపీడీవో విష్ణు చిరంజీవి పేర్కొన్నారు. సమావేశం అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ పాల్గొంటారని తెలిపారు.

శునకాలకు జనన నియంత్రణ శస్త్రచికిత్సలు

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణాన్ని రేబిస్ రహితంగా చేయడమే లక్ష్యంగా తిరుపతికి చెందిన అనిమల్ కేర్ ల్యాండ్ సంస్థ సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్టు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని వీధి శునకాలను శిక్షణ పొందిన నిపుణులతో బంధించి అనిమల్ కేర్‌ల్యాండ్‌కు తరలించినట్టు తెలిపారు. పశువైద్యుల సహకారంతో వాటికి జనన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించి వారంరోజుల పాటు జాగ్రత్తలు తీసుకుని రేబిస్ టీకాలు వేసిన తరువాత వాటిని పట్టుకున్న చోటే వదులుతామన్నారు. పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకుడు ఎన్‌వీ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కుక్కను పడుతున్న అనిమల్ కేర్ ల్యాండ్ సిబ్బంది

వేదోక్తంగా మృత్యుంజయస్వామికి పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయస్వామికి సోమవారం వేదోక్తంగా పూజలు నిర్వహించారు. పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

టీడీపీ నాయకుడి చొరవ... శ్మశానంలో ముళ్లపొదల తొలగింపు



శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లపాళెం బీసీ కాలనీ శ్మశాన వాటికలో ముళ్ల పొదలను టీడీపీ నాయకుడి చొరవతో తొలగించారు. కాగా శ్మశానం ముళ్ల పొదలతో నిండిపోయింది. ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాల నిర్వహణకు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. దీంతో రాచగున్నేరి మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు బొల్లినేని జగన్నాథంనాయుడు తన సొంత నిధులతో ఎక్స్‌కవేటర్ సాయంతో ముళ్లపొదలను తొలగించి శ్మశానవాటికను శుభ్రం చేయించారు.

స్కూటర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు స్కూటరిస్టు మృతి

ఏర్పేడు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో స్కూటరిస్టు దుర్మరణం చెందాడు. సీఐ జయచంద్ర తెలిపిన వివరాలు... వెంకటగిరి నియోజకవర్గంలో దగ్గవోలుకు చెందిన రమణయ్య(79) గొర్రెల వ్యాపారి. ఈ క్రమంలో గొర్రెలను కొనడానికి దగ్గవోలు నుంచి సోమవారం ఉదయం ఏర్పేడు మండలం చింతలపాళెంకు ద్విచక్ర వాహనంపై వచ్చాడు. తిరిగి వెళ్తుండగా వెంకటగిరి నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో రమణయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ పరారయ్యాడు. పోలీసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

జనసేన కార్యకర్తకు నివాళి

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లపాళెంకు చెందిన జనసేన క్రియాశీల కార్యకర్త పృథ్వీ(28) అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాచగున్నేరి మాజీ సర్పంచు, టీడీపీ నాయకుడు బి. జగన్నాథంనాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్ చల్లపాళెంకు చేరుకుని పృథ్వీ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే విధంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత కూడా పృథ్వీ మృతదేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పృథ్వీ కుటుంబ సభ్యులకు జనసేన అండగా ఉంటుందని తెలిపారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

వరదయ్యపాళెం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబూరులో జరిగిన గ్రామసభలో స్థానికులు, రైతులు భూ ఆక్రమణలపై అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. పలు సర్వే నెంబర్లలో జరిగిన ఆక్రమణలపై వారు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణ జరిపి ఆక్రమణకు గురైన భూములను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మణి, రోజా, రాణి, గురుబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు నాగుల చవితి

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): నాగుల చవితిని పురస్కరించుకుని నాగులపుట్ట కొలవైన ప్రదేశాలు సుందరంగా ముస్తాబయ్యాయి. కార్తీకమాసం చవితి తిథి రోజున నాగుల చవితిగా భక్తులు ఆరాధించే విషయం తెలిసిందే. మంగళవారం జరగనున్న ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి పట్టణంలోని నాగులపుట్టలు కొలువైన ప్రదేశాలను స్థానికులు సుందరంగా అలంకరించుకున్నారు.

పెట్టుబడి సాయం రూ.20వేలు ఇవ్వాలి

ఏపీ రైతు సంఘం



వీఎస్‌పురం సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న రామానాయుడు తదితరులు

బుచ్చినాయుడుకండ్రిగ, నవంబరు 4 (ఆంధ్రజ్యోతి): తాము అధికారంలోకి వస్తే రైతుల పెట్టుబడి సాయంగా రూ.20వేలు ఇస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం ఇప్పటికీ చర్యలు తీసుకోలేదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు విమర్శించారు. మండలంలోని వీఎస్‌పురం, బీఎన్‌కండ్రిగ, కంచనపుత్తూరు సచివాలయాల్లో కార్యదర్శులకు సీపీఐ నాయకులతో కలిసి రైతులు సమస్యలు పరిష్కారించాలని వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబంపై సుమారు రూ.2.45 లక్షల రుణం ఉందన్నారు. రాయలసీమ జిల్లాల్లో కరువు పరిస్థితి ఉండగా... కోస్తా తీర ప్రాంత జిల్లాలో భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఖరీఫ్‌లో సుమారు రెండు లక్షల ఎకరాల్లో పంట పెట్టలేక పోయారన్నారు. రబీ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. సీపీఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శులు కత్తి రవి, ప్రవీణ్, నాయకులు కృష్ణయ్య, భాస్కర్, వెంకటకృష్ణయ్య, చొక్కలింగం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక తొలి సోమవార పూజలు



గుడిమల్లం ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

పిచ్చాటూరు, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో సుప్రసిద్ధ ఆలయమైన రామగిరి వాలీశ్వరస్వామి దేవాలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని భక్తులు దీపాలు వెలిగించారు. మొదటి కార్తీక సోమవారం కావడంతో ఆలయ అర్చకులు స్వామికి వివిధ రకాల అభిషేకాలు చేసి పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు స్కంద పుష్కరిణిలో స్నానమాచరించి కాలభైరవ స్వామి ఆలయం ఎదుట దీపాలను వెలిగించి వాలీశ్వరుడిని దర్శించుకున్నారు.

నారాయణవనం: మండలంలోని కైలాసకోనలో కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి కైలాసనాథుడిని దర్శించుకున్నారు. అలాగే మహిళా భక్తులు దీపాలు పెట్టారు.

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశు రామేశ్వరస్వామి ఆయలంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు జరిగాయి. ఆలయంలో గోమాతకు పూజలు చేశారు. రాత్రి మహిళలు పెద్దఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. పరశురామేశ్వరుడిని చిత్తూరు ఎస్పీ మణికంఠ చందోల్, ఆయన సతీమణి రైల్వే డీఎస్పీ హర్షిత దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పట్లు చేశారు. అర్చకుడు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గిరినాయుడు, ఈవో రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుర్గంధాన్ని భరించలేకున్నాం!



కేవీబీపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దళిత వాడలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా దెబ్బతినడంతో మురుగు పేరుకుపోయి దుర్గంధాన్ని వెదజల్లుతోందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఆ ప్రాంతంలో దోమలు వృద్ధి చెంది జ్వరాల బారిన పడుతున్నామని చెప్పారు. ఇప్పటికైనా సంబంధిత పారిశుధ్య సిబ్బంది స్పందించి మురుగు తొలగించాలని కోరుతున్నారు.

పాత చెక్‌పోస్టు రోడ్డులో పొంగి పొర్లుతున్న మురుగు



రేణిగుంట, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలోని పాత చెక్‌పోస్టు రోడ్డుపై భారీ ఎత్తున మురుగు పొంగి పొర్లుతోంది. సోమవారం రోడ్డుపై మురుగు ఎక్కువ కావడంతో ఆ ప్రాంతం మొత్తం కంపుకొడుతోంది. రోడ్డు వారన ఉన్న డ్రైనేజీ పైపులైన్ ధ్వంసం కావడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో పాతచెక్‌పోస్టు కూడలిలో భారీ ఎత్తున రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తోంది. పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాల్సి ఉంది.

టీడీపీ మండల అధ్యక్షుడికి ఎమ్మెల్యే ఆదిమూలం పరామర్శ

కేవీబీపురం, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజులకండ్రిగలో ఆదివారం టీడీపీ సీనియర్ నాయకుడు, మండల అధ్యక్షుడు రామాంజులు నాయుడు సోదరుడు శ్రీనివాసులు నాయుడు మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆదిమూలం సోమవారం రాజులకండ్రిగకు చేరుకుని శ్రీనివాసులునాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే వగత్తూరులోని టీడీపీ నాయకుడు గోపాల్ అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆయన్నూ పరామర్శించారు. గోపినాథరెడ్డి, మల్లికార్జునరెడ్డి, సురేష్‌రెడ్డి, జయరామిరెడ్డి, సర్పంచు వెంకటేశ్వర్లు, కేశవులునాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్యే సుధీర్



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ అన్నారు. శ్రీకాళహస్తి ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా సమస్యలపై ఎమ్మెల్యే ఆరా తీశారు. అన్ని శాఖల అధికారులు వారి పరిధిలోని సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫి, జడ్పీటీసీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8న ఏడుగంగమ్మల ఆలయ మహా కుంభాభిషేకం

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ముత్యాలమ్మ గుడివీధిలోని ఏడుగంగమ్మల ఆలయానికి ఈనెల 8న శుక్రవారం మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నట్టు ఈవో బాపిరెడ్డి పేర్కొన్నారు. 7న సాయంత్రం 6గంటలకు పూజా కార్యక్రమాలు, 8వ తేదీ ఉదయం 9 నుంచి 10.30 గంటల లోపు మహాకుంభాభిషేకం జరుగుతుందన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువు

మాజీ మంత్రి రోజా



స్వామివారిని దర్శించుకున్న రోజా

శ్రీకాళహస్తి, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని మాజీ మంత్రి రోజా ఆరోపించారు. సోమవారం ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో శాంతి భద్రతలు విఫలమయ్యాయన్నారు. అడుగడుగునా మహిళలు, బాలికలను చిదిమేయడం బాధాకరమన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తాను హోంమంత్రిని అయితే శాంతి భద్రతలను కాపాడుతాననడం చేతకాని తనానికి నిదర్శనమన్నారు. 120 రోజుల కూటమి పాలనలో మహిళలపై వందకు పైగా దారుణమైన ఘటనలు చోటు చేసుకున్నాయన్నారు.